శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




బిజెపి ఇలాంటి పనులు కూడా చేస్తుందా! 4లో


శనివారం | 18-05-2024 | హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 328 | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## ఆగస్టులో పంచాయతీ ఎన్నికలు?

రాష్ట్రంలో 12,814 సర్పంచులకు జులై మూడవ వారంలో రిజర్వేషన్ల ప్రక్రియ

ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు!

ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి

తెలంగాణాలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారబించినట్లు సమాచారం. గత ఆగస్టులో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో రాష్ట్రంలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికలు సైతం ముగియడం, జూన్ 4న కౌంటింగ్ జరిగి ఫలితాలు ప్రకటించడంతో ఎన్నికల కోడ్ ముగియనుంది. దీంతో ప్రభుత్వం సర్పంచుల ఎన్నికల నిర్వహణ కోసం ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను పురమాయించినట్లు తెలుస్తోంది. జూన్ మొదటి వారంలో వార్డుల విభజన, రెండవ వారంలో రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభించి మూడవ వారంలో సర్పంచులకు, వార్డులకు రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టి పూర్తి చేసి జులై మొదటి వారంలో షెడ్యూల్, చివరి వారంలో నోటిఫికేషన్ ఇచ్చే యోచనలో అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ తరువాయి 2లో

## నేడు మంత్రివర్గ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనుంది. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేళ్లు పూర్తికానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించనున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై మంత్రివర్గం చర్చించనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినేట్ లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ తదితర అంశాలను మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు.



నాటుసారా, అక్రమ మద్యంపై

## నిఘా పెంచండి

ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్

ప్రజాపక్షం/హైదరాబాద్

నాటుసారా, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్ తయారీ, సరఫరాపై నిఘా పెట్టి పూర్తిగా తుదముట్టించాలని ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్ అధికారులకు సూచించారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో శుక్రవారం తెలంగాణ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించబడిందని భావించిన నాటుసారా తయారీదారులు మళ్లీ విజృంభిస్తున్నారని శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 ఎక్సైజ్‌శాఖ స్టేషన్ల పరిధిలో నాటుసారా తయారీ జరుగుతున్నట్లు దాడుల్లో బయట పడిందని పేర్కొన్నారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తరువాయి 2లో

## కెఎ పాల్‌పై చీటింగ్ కేసు

ఎమ్మెల్యే టిక్కెట్ కోసం రూ.50 లక్షలు తీసుకున్నారని ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్



ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని ఓ వ్యక్తి నుంచి రూ.50 లక్షలు తీసుకున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్‌పై పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా జిల్లెలగూడకు చెందిన కిరణ్ కొంత కాలంగా ప్రజాశాంతి పార్టీలో పని చేస్తున్నాడు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌బి నగర్ నియోజక వర్గం నుంచి ప్రజాశాంతి పార్టీ తరఫున పోటీ చేయాలని కిరణ్ అనుకున్నాడు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్‌ను సంప్రదించాడు. అయితే బి ఫారమ్ ఇచ్చేందుకు కిరణ్‌ను రూ.50 లక్షలు డిమాండ్ చేశారు. అంగీకరించిన కిరణ్ ఆన్‌లైన్ ద్వారా కెఎ పాల్ అకౌంట్‌లోకి రూ.30 లక్షలు ఒకసారి మిగిలిన రూ.20 లక్షలు పలు దఫాలుగా నగదు రూపంలో ఇచ్చాడు. డబ్బులు తీసుకున్న కెఎ పాల్ బి ఫారమ్ ఇవ్వలేదని కిరణ్ ఆరోపించాడు. డబ్బులు వెనక్కి ఇచ్చివేయాలని పలుమార్లు కెఎ పాల్‌ను అభ్యర్థించినా ఫలితం లేకుండా పోయింది. బాధితుడు కిరణ్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో మరో ఐదు రోజులు వర్షాలు

ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అలాగే ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు. మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్న చక్రవాతపు ఆవర్తనం శుక్రవారం అదే ప్రాంతంలో తరువాయి 2లో

# మోదీ హామీలపై ప్రశ్నలు ఎన్నో!



పేదల సొమ్ము ధనికుల పాలు

లౌకికవాదానికి తూట్లు.... ప్రజాస్వామ్యానికి పాట్లు

సార్వత్రిక ఎన్నికల సమరం క్రమంగా ముగింపు దిశగా వెళుతుండగా, బిజెపి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని అంశాలను కూడా ప్రస్తావిస్తూ, ప్రజలను ఆకట్టుకోడానికి ప్రధాని నరేంద్ర మోదీ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అయితే, ఆయన ఇస్తున్న హామీలపై ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ పథకాన్ని పొడిగింపు. 'ది వైర్' ప్రస్తావించిన విధంగా, దేశంలో సుమారు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మరోసారి అధికారంలోకి వస్తే, ఈ పథకాన్ని వచ్చే ఐదేళ్లపాటు కొనసాగిస్తామన్నది మోదీ హామీ. అంటే, గత పదేళ్ల మాదిరిగానే, రాబోయే ఐదేళ్లలోనూ పేదలు పేదలుగానే మగ్గిపోవాలా? వారు ఆర్థికంగా ఎదిగే అవకాశమే లేదా? సగటు మనిషి అభ్యున్నతిని బిజెపి పట్టించుకోదా? ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం తగ్గనే తగ్గదా? ఇలాంటి ప్రశ్నలు ఎన్నో. 140 కోట్ల మంది ప్రజల్లో 80 కోట్ల మంది ఉచిత రేషన్‌పై ఆధారపడి బతుకుతున్నారంటే, దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవడం కష్టం కాదు. ఇప్పుడు 70 కోట్ల మంది పేద భారతీయుల సంపద ఇప్పుడు కేవలం 21 మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతమైందన్నది చేదు నిజం. వచ్చే ఐదేళ్లలో, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో, ఐదో స్థానం నుంచి మూడు లేదా నాలుగో స్థానానికి వెళుతుందని, ఈ దిశగా అభివృద్ధి సాధిస్తామని మోదీ అంటున్నారు. కానీ, ఇది నమ్మశక్యంగా లేదు. ఒకవేళ ఆ స్థానానికి ఎదిగినా, సంపద కేంద్రీకరణ కారణంగా, పేదలకు ఒరిగే లాభం ఏమీ ఉండదు. ధరల పెరుగుదలకు కళ్లెం పడలేదు. ద్రవ్యోల్బణం అదుపులోకి రాలేదు. ప్రైవేటు పెట్టుబడుల వరదలు లేవు. ఉత్పత్తి రంగం పరుగులు తీయడం లేదు. గృహరుణాలు అత్యధికంగా ఉండగా, గృహాల పొదుపు గత ఐదు శతాబ్దాల్లోనే కనిష్టానికి చేరుకున్నాయి. రూపాయి మారకపు విలువ పడిపోతున్నది . ఆర్థిక అసమానత ఎన్నడూ లేనంతగా పెరిగాయి. బిజెపి రెండు సార్లు గెలిపించినందుకు ఈ దుస్థితి ఏర్పడింది. ముచ్చటగా మూడోసారి కూడా అధికార పగ్గాలను అప్పగిస్తే పరిస్థితి ఏమిటి. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నమంగళ సూత్రాలను కూడా తరువాయి 2లో

మిగిలిన ధాన్యాన్ని

## త్వరగా సేకరించేలా చర్యలు

కలెక్టర్లకు సిఎస్ ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంకా రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని త్వరగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు వేగంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొంత మంది జిల్లాల కలెక్టర్లు తీసుకున్న చర్యలను సిఎస్ అభినందించారు. ఇదే విధానాన్ని అనుకరించి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా ఉండేలా అన్ని జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల పురోగతి, వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద పనులు పురోగతిని వేగవంతం చేసి పూర్తి చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను సి.ఎస్ అభినందించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తేదీ జూన్ 12 లోగా వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. పాఠశాలలు తెరిచే రోజున ప్రతి విద్యార్థికి నోట్ బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, ఒక జత స్కూల్ యూనిఫామ్ అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. చిన్నపాటి మరమ్మతు పనులు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, తాగునీరు, పెయింటింగ్, ఫర్నీచర్ పనులు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షించాలని ఆమె అధికారులను ఆదేశించారు. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం, పంచాయత్‌రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ తరువాయి 2లో



ధాన్యం కొనుగోళ్లలో

## అదే ఉదాసీనత

అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతల్లో ఆందోళన

ఓవైపు అకాల వర్షాలు..మరోవైపు కొనుగోళ్ల జాప్యం

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్

అన్నదాతలకు ఏ ప్రభుత్వం వచ్చినా ఆదుకోవడం లేదన్నది అర్థం అయ్యింది అకాల వర్షం కురుస్తాయని ఆకాశవాణి కేంద్రం ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్న అధికారుల నిర్లక్ష్యానికి,రైతులు అరుగాలం కష్టపడి పండించిన పంటను నేలపాలు చేసుకునే పరిస్థితి నెలకొంది.ఎప్పటికప్పుడు భారధన్ ఇచ్చి లారీలను పంపాల్సిన అధికారులు పంపకపోవడం వల్ల వరి ధాన్యాన్ని కలలపై తుడుస్తున ధాన్యం,అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లడం లేదు.మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది.నిర్మల్ జిల్లాలో ఇరిగేషన్ సరిగా లేకపోవడం బోరుబావులతోనే పంటలు పండించడం,దాదాపు రైతులు ఇతర జిల్లాల తరువాయి 2లో

లోక్‌సభ ఫలితాలపైనే

## 'గులాబీ' భవిష్యత్తు

సవాలుగా మారిన ఎన్నికలు

బి టి బ్యాచ్ ఉండేనా ?




ప్రజాపక్షం/హైదరాబాద్

'గులాబీ' పార్టీకి లోక్‌సభ ఎన్నికలు పెద్ద సవాలుగా మారాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ఆధారంగానే బిఆర్ఎస్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఆ పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతలు, మరి కొందరు ప్రజాప్రతినిధులు కూడా లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. ఎన్నికల ఫలితాల ఆధారంగానే వారు తమ రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. 25 మంది బిఆర్ఎస్ ఎంఎల్ఎలు జూన్ 5న కాంగ్రెస్‌లో చేరుతారని సాక్షాత్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల బిఆర్ఎస్ మనుగడకు పెద్ద సవాల్ అనే చర్చ జరుగుతున్నది. బిఆర్ఎస్ ముఖ్యనేతుల చెబుతున్నట్టు ఎంపి స్థానాలు వస్తాయా? లేదా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్టు 'వన్ ఆర్ నన్'(ఒకటి లేదా సున్న స్థానాలు ) వస్తాయా అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే కాంగ్రెస్, బిజెపిలకు ఎన్ని స్థానాలు వస్తాయన్న దానికంటే, బిఆర్ఎస్ ఓటు బ్యాంక్ బిజెపికి ఎంత మేర మళ్లిందోనని ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయించడంలో బిఆర్ఎస్ కీలకం కానున్నట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెబుతున్నట్టు 13 లోక్‌సభ స్థానాలు వస్తే ఆపార్టీకి వచ్చిన ఢోకానే లేదని, కానీ ఇతరులు అంచనా వేస్తున్నట్టు ఒకటి, లేదా సున్నా స్థానాలు వస్తేనే 'కారు'కు రాజకీయ గండం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బిఆర్ఎస్‌కు 39 ఎంఎల్ఎలు ఉండగా ఇందులో ముగ్గురు కాంగ్రెస్‌లో చేరగా, కంటోన్మెంట్ శాసనసభకు ఉప ఎన్నిక జరిగింది. దీంతో ప్రస్తుతం బిఆర్ఎస్‌లో 35 మంది ఎంఎల్ఎలు ఉన్నారు. ఇందులో కొందరు తరువాయి 2లో



ఎయిర్ టాక్సీ సేవల్లోకి

## డ్రోగో డ్రోన్స్

30 లక్షల ఎకరాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి ఇఫ్కోతో ఒప్పందం

జిల్లా, మండల కేంద్రాల్లో డ్రోన్ సర్వీస్ హబ్ ఏర్పాటు

డ్రోగో సిఇఒ యశ్వంత్ బొంతు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎయిర్ టాక్సీ తో పాటు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు డ్రోగో డ్రోన్స్ సిఇఒ యశ్వంత్ బొంతు ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా 30 లక్షల ఎకరాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి ఇఫ్కోతో ఒప్పందం చేసుకోవటంతో పాటు వ్యవసాయ రంగంలో విస్తృతమైన సేవలు అందించే కృషీ 3 డ్రోన్ కు పౌర విమానయాన సంస్థ డైరెక్టర్ జనరల్ (డిజిసిఎ) అనుమతులు లభించిన నేపథ్యంలో శుక్రవారం తమ సంస్థ భవిష్యత్ ప్రణాళికల గురించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వే, మ్యాపింగ్, ఉత్పత్తుల రవాణా మరికొన్ని ఇతర రంగాలకు తమ సంస్థ డ్రోగో డ్రోన్స్ సేవలను విస్తరిస్తామని తరువాయి 2లో

మరాఠా ఓటర్ల మదిలో

## థాక్రేదే అసలైన శివసేన

మహారాష్ట్ర : మరాఠా ప్రాంతీయ పార్టీ శివసేనలో 2022లో సంభవించిన చీలిక తరువాత జరుగుతున్న మొదటి సార్వత్రిక ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు ఏ శివసేన వైపు మొగ్గు చూపుతారో నని దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి), సిఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలు హోరాహోరీగా తలపడుతున్నాయి. లోక్‌సభ చివరి దశ ఎన్నికలు జరిగే 14 లోక్‌సభ స్థానాలలో రెండు సేనల మధ్య పోరు ఉధృతంగా సాగుతోంది. అసలు శివసేన ఎవరిదనే వాదనల మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో శివసైనిక మదిలో ,గుండెల్లో థాక్రే ఉన్నారా? లేదా షిండే గూడు కట్టుకున్నాడా? అనేది స్పష్టం కానుంది. వీరిరువురిలో శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే నిజమైన వారసత్వం ఎవరి వైపు మొగ్గనుంది ఓటర్లు పటాపంచలు చేయనున్నారు. చివరి దశలో ఎన్నికలు జరిగే 14 స్థానాలు ఎక్కువగా ముంబై నగరం, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ తరువాయి 8లో



ఉద్ధవ్ థాక్రే సభకు భారీగా ప్రజలు

మాజీ సిఎం, శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే ప్రచార సభలకు భారీగా ప్రజలు తరలి వస్తున్నారు. మృదుస్వభావి, మితభాషి అని పేరున్న ఆయన ఈసారి తన ప్రసంగాలలో పదునైన విమర్శలతో బిజెపి, ప్రధాని మోదీ, షిండే సేనలను చీల్చి చెండాడుతుంటే సభికులు హర్షాధ్వానాలు తరువాయి 8లో

ప్రతి జిల్లాలో

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

రైతులకు గిట్టుబాటు ధర రావడమే కాకుండా నష్టపోయే అవకాశం ఉండదు

టెస్కో ద్వారా నాప్‌కిన్ తయారీ యూనిట్లు

సమీక్షా సమావేశంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఆ దిశగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను వ్యవసాయ, మార్కెటింగ్, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఈ మేరకు పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, టిఎస్ఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి , జౌళిశాఖ సంచాలకులు అలుగు వర్షిణి, హార్టికల్చర్ సంచాలకులు అశోక్‌రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి.లక్ష్మీ బాయి, పరిశ్రమల శాఖ తరువాయి 8లో

## ఫ్రాన్స్ యూదు ఆలయ ధ్వంసానికి యత్నం : వ్యక్తి కాల్చివేత

**పారిస్ :** ఫ్రాన్స్‌లో ఒక యూదుల ఆలయం "సైనాగోగ్యూను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులు కాల్చి చంపారు. రొయెన్ రాష్ట్రం నోర్మండీ నగరంలో ఉన్న యూదుల ఆలయంలో అగ్ని ప్రమాదం సృష్టించి ఆ ఆలయం వద్దనే తిరుగుతున్న ఒక వ్యక్తిని పోలీసులు గుర్తించారు. దాంతో అతడు పోలీసులపై దాడి చేసేందుకు మారణాయుధాలు వెలికితీశారు. దాంతో పోలీస్ అతడిని కాల్చి చంపారు. ఫ్రెంచ్ దేశీయాంగమంత్రి గెరాల్డ్ దార్మనిన్ ఈ మేరకు ఎక్స్ వేదికపై ఒక పోస్టింగ్ పెట్టారు. సకాలంలో స్పందించి మరో యూదువ్యతిరేక విధ్వంసం జరగకుండా అడ్డుకున్న పోలీసులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. శుక్రవారం ఉదయం 6.45 గంటలకు యూదు ఆలయం వద్ద ఈ ఘటన జరిగింది. అతడి నుండి ఒక పెద్ద కత్తితోపాటు ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పారిస్‌కు 130 కి.మీ దూరంలో నైరుతిదిశగా ఉన్న నోర్మండీలో యూదు ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు, గాజాలో పాలస్తీనియన్ల ఊచకోత కొనసాగుతున్న తరుణంలో ఈ ఘటన ఫ్రాన్స్‌లో ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించింది. నోర్మండీ నగర మేయర్ నికోలస్ రొస్సింగ్నోల్ కూడా ఎక్స్ వేదికపై ఒక పోస్టింగ్ పెడుతూ, అగ్నిమాపకదళ అధికారులు సకాలంలో స్పందించారన్నారు. యూదు వ్యతిరేక ద్వేషం వ్యాప్తం చెందకుండా పోలీసులు నివారించారని ఫ్రాన్స్ కన్సిస్టోయిర్ సెంట్రల్ జ్యూయిష్ ఆలయాల విభాగం అధ్యక్షుడు ఎలైకోర్బియా వ్యాఖ్యానించారు. సైనాగోగ్యూపై దాడి ఫ్రెంచ్ రిపబ్లిక్‌పై దాడి అని, దేశంలో యూదులను భయభ్రాంతులను చేసేందుకే ఈ ప్రయత్నం జరిగిందనీ రిప్రజెంటేటివ్ ఆఫ్ జ్యూయిష్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రాన్స్ అధ్యక్షుడు యోనాథిన్ అర్ఫి ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు.

### ఛాడ్ దేశంలో బూటకపు ఎన్నికలు!

## జుంటా నేత ఇద్రిస్ గెలుపు



**ఎంజెమెనా :** దక్షిణాఫ్రికాదేశం ఛాడ్‌లో అంతా అనుకున్నట్టుగానే దేశ నియంత పాలకుడు జనరల్ మహమత్ ఇద్రిస్ దెబే ఇంటో ఎన్నికల్లో విజయం సాధించి దేశాధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. ఐతే ఈ ఎన్నిక చెల్లదని మిగిలిన అభ్యర్థులు పెద్ద గొంతుతో అరచినప్పటికీ ఎన్నికల సంఘం వారి అరణ్యఘోషను తోసిపుచ్చింది. ఈ గెలుపుతో మూడు సంవత్సరాలుగా ఛాడ్‌దేశంలో కొనసాగిన నియంత పరిపాలనకు తెరపడింది! ఈ నెల 6వ తేదీన దేశ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. శుక్రవారంనాడు ఫలితాలు ప్రకటించారు. 61 శాతం ఓట్లతో అధ్యక్షుడుగా జుంటా పాలకుడు మహమత్ గెలిచారు. ఈ ఫలితాలు వచ్చాక దెబే ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఐతే మే తొమ్మిదవతేదీన ప్రావిజనల్ ఫలితాలను వెల్లడించి తానే దేశాధ్యక్షుడినని దెబే ప్రకటించుకున్నారు. ఇక సైనిక పాలనకు తెర పడిందని కూడా ఆయన అన్నారు. ఇప్పటివరకూ ప్రధానమంత్రిగా పనిచేసిన మస్రా ఈ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేయగా రాజ్యాంగ మండలి అందుకు తిరస్కరించింది. మస్రాకు 18.5 శాతం ఓట్లు వచ్చాయి. ఆయన రెండోస్థానంలో నిలిచారు. మాజీ ప్రధానమంత్రి అల్బెర్ట్ పహిమికి 16.9 శాతం ఓట్లు వచ్చాయి. 40 ఏళ్ళు వయసుగల మస్రా దేశంలో ఆర్థికవేత్తగా పేరొందారు. ఎన్నికల ప్రచారంలో అంతకుముందు కూడా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జుంటా నాయకుడు ఇద్రిస్ దెబే రెండోస్థానంలో ఉంటాడనీ, మస్రాదే దేశాధ్యక్ష పదవి అనీ అంతా భావించారు. కానీ జుంటా నాయకుడు మాత్రం తనదైన పద్ధతిలో వ్యవహరించారు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రజలకు ఆశ్చర్యం కలిగించినా ఎవరూ నోరెత్తలేదు. ఐతే మస్రా మరి ఇక మీదట ప్రధాన మంత్రిగా కొనసాగుతారా? లేదా? అనే విషయం మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. ప్రతిపక్షాలు మాత్రం ఇది ముందుగా నిర్దేశించిన ఏకపక్ష ఎన్నికలని పేర్కొంటూ ఈ ఎన్నికలను బహిష్కరించాయి.

# పాలస్తినాలో ఊచకోతా..? అలాంటిదేం లేదే?

### దక్షిణాఫ్రికా సాక్ష్యాలన్నీ బూటకం!
### అంతర్జాతీయ కోర్టులో ఇజ్రాయిల్ పచ్చి అబద్ధాలు



**హేగ్ :** గాజాలో ఎలాంటి సామూహిక హత్యాకాండా జరగడంలేదని, అందుకు ఎలాంటి సాక్ష్యాలూ లేవని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె)లో ఇజ్రాయిల్ పచ్చి అబద్ధాలు చెప్పింది. పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సామూహిక హత్యాకాండకు గురిచేస్తోందనీ, తక్షణం రఫాలో మారణహోమాన్ని ఆపాలనీ దక్షిణాఫ్రికా ఫిర్యాదు మేరకు అంతర్జాతీయ న్యాయస్థానంలో గురు, శుక్రవారాల్లో 15 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గాజాలో యుద్ధం ఆపేయాలని జనవరిలో జరిగిన విచారణ సందర్భంగా అంతర్జాతీయ కోర్టు ఇజ్రాయిల్‌కు హెచ్చరిక చేసింది. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ తరపు న్యాయవాది గిలాడ్ నోయమ్ అంతర్జాతీయ కోర్టులో కనీసబాధ్యతలు కూడా విస్మరించి పచ్చి అబద్ధాలు ఎత్తుకున్నారు. ''గాజాలో జరుగుతున్నది కేవలం ఒక విషాదం మాత్రమే, అది సామూహిక హత్యాకాండ కాదు'' అని సదరు న్యాయవాది ఐసిజె న్యాయమూర్తులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. తమపై చేసిన ఆరోపణలపై ఇజ్రాయిల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, గాజాలో అడపాదడపా జరిగిన ఏవో కొన్ని ఘటనలు తప్ప అదెంతమాత్రం సామూహిక హత్యాకాండ కాదని ఆయన అన్నారు. గాజాలో సామూహిక హత్యాకాండ జరిగిందనడానికి ఎలాంటి విశ్వసనీయమైన సాక్ష్యాధారాలూలేవని గిలాడ్ నోయమ్ అన్నారు. దక్షిణాఫ్రికా చెప్పేవన్నీ అబద్ధాలనీ, ఆ దేశం వద్ద ఉన్నవన్నీ ఆధార రహితమైన సాక్ష్యాధారాలేననీ ఆయన బుకాయించారు. ఖాన్ యూనిస్‌లోని ఆసుపత్రిలో అనేక వందలమందిని సామూహికంగా చంపి, ఇజ్రాయిల్ చేసిన 10కి పైగా సామూహిక సమాధులను ఇప్పటికే సహాయ బృందాలు వెలికి తీశాయి. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకువచ్చాయి. గాజా యుద్ధంలో 189 మంది ఐక్యరాజ్య సమితి సహాయ బృందాలు కూడా ఇప్పటివరకూ మరణించిన విషయాన్ని కూడా దక్షిణాఫ్రికా లాంఛనంగా కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ సాక్ష్యాధారాలను కూడా ఇజ్రాయిల్ మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. దక్షిణాఫ్రికా ఫిర్యాదు మేరకు అంతర్జాతీయ న్యాయస్థానంలో రెండు రోజులపాటు ఇజ్రాయిల్ దాష్టీకాలపై విచారణ జరిగింది. ఇప్పటికే గాజాను ఇజ్రాయిల్ సర్వనాశనం చేసిందనీ, 15 లక్షలమంది పాలస్తినా ప్రజలు రఫాలో తలదాచుకుంటే అక్కడి నుండి కూడా వారిని తరిమికొట్టి సముద్రంలోకి తప్ప ఎటువెళ్ళాలో తెలియని పరిస్థితులు సృష్టించిందనీ, ఈ కారణంగా ఇప్పటికే 6,00,000 మంది పాలస్తీనియన్లు ప్రాణభయంతో రఫా నుండి పారిపోయారనీ, ఇప్పటికే రఫాలో అనేకమందిని ఇజ్రాయిల్ సైన్యం హతమార్చిందనీ ఐక్యరాజ్యసమితికి దక్షిణ ఆఫ్రికా ఫిర్యాదు చేసింది. ఐక్యరాజ్య సమితి ఇచ్చిన నివేదికలను తాము ఆషామాషీగా భావించడంలేదనీ, చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామనీ, ఐతే అదే సమయంలో ఐక్యరాజ్యసమితి నివేదికలో చెప్పిన విషయాలను అంత సులభంగా సమ్మతించబోమని కూడా ఇజ్రాయిల్ న్యాయవాది బాహాటంగా సవాలు చేశారు.

## ఉక్రేన్ వోవ్‌ఛాన్స్‌లో దూసుకుపోతున్న రష్యా

### దిగాలు పడిన జెలెన్స్కీ

**మాస్కో :** ఉక్రేన్ యుద్ధంలో రష్యా దూకుడుగా ముందుకు దూసుకుపోతున్నది. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై యుద్ధం ప్రకటించిన తర్వాత సైనికంగా, ఆయుధపరంగా చాలా నష్టాలు ఎదుర్కొన్న రష్యా కొత్త రక్షణ మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత వారం రోజులుగా ఉక్రేన్ యుద్ధంలో ముందుకు దూసుకుపోతున్నది. కాగా ఉక్రేన్ తన సరిహద్దుల్లో ఉన్న రష్యా బెలగరోడ్ ప్రాంతంలో వరుస దాడులతో బీభత్సం సృష్టిస్తున్నది. రష్యాకు చెందిన 20 డ్రోన్లను ఉక్రేన్ కూల్చి వేసింది. రష్యా సైన్యం ముందుకు వెళ్ళకుండా అడ్డుకునేందుకు తమ సైన్యం ప్రయత్నం చేస్తోందని జెలెన్స్కీ ప్రకటించారు. శుక్రవారంనాడు మిలిటరీ కమాండర్లతో ఆయన కీలక సమావేశం జరిపారు. ఉక్రేన్‌లో కొత్త సరిహద్దు గ్రామాలను తన అధీనంలోకి తెచ్చుకుంది. వోవ్‌ఛాన్స్‌లో ప్రవేశించి ముందుకు దూసుకుపోతున్నది. ఈ దశలో ఖార్ఖీవ్ పరిసర ప్రాంతాల నుండి 8,000 మంది ప్రజలకు ఉక్రేన్ ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఖార్ఖీవ్‌లో పరిస్థితి నిరాశాజనకంగా ఉందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వ్యాఖ్యానించారు. తన విదేశీ పర్యటనలు కూడా వాయిదా వేసుకున్నారు. ఉక్రేన్‌కు తీవ్ర సైనిక, ఆయుధ నష్టం జరిగిందని నాలుగురోజుల క్రితం రష్యా ప్రకటించాక అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆకస్మికంగా కీవ్‌లో పర్యటించారు. రెండు బిలియన్ డాలర్ల విలువైన అదనపు ఆయుధాలను ఉక్రేన్‌కు సరఫరా చేస్తామని జెలెన్స్కీకి భరోసా ఇచ్చారు. తమ దేశం ఆయుధ కొరతను ఎదుర్కొంటున్నదని, తక్షణం ఆయుధాలు సరఫరా చేయాలని బ్లింకెన్‌కు జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. తన వెనకే ఆయుధాలు వస్తున్నాయని తీసుకోవాలని బ్లింకెన్ అందుకు బదులుగా చెప్పారు. కాగా యుద్ధంలో ముందుకు దూసుకుపోతున్న రష్యా సేనలపై నాటో కూటమి వ్యాఖ్యానిస్తూ, ఖార్ఖీవ్‌లో భారీ విజయం సాధించేంత శక్తిసామర్థ్యాలు రష్యాకు లేవని పెదవి విరిచింది.

# ఉక్రేన్‌తో చర్చలను ఎన్నడూ తిరస్కరించలేదు : పుతిన్

### చర్చించేందుకు అక్కడ విశ్వసనీయత కలిగిన వారు ఎవరో?

**రష్యా :** ఉక్రేన్‌తో చర్చలను రష్యా ఎన్నడూ తిరస్కరించలేదని, అయితే , ఎవరితో మాట్లాడాలి, అక్కడ విశ్వసనీయత కలిగిన వారు ఎవరో అని రష్యా అధ్యక్షులు వ్లాదిమన్ పుతిన్ అన్నారు. చైనా పర్యటనకు తనతో పాటు వెళ్ళిన రష్యా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మాస్కో ఎన్నడూ చర్చలను తిరస్కరించలేదు. కీవ్(ఉక్రేన్ రాజధాని) నుండి బలగాలు వెనక్కి మళ్ళిన వెంటనే కీవ్ రాజకీయ నాయకులే చర్చల ప్రక్రియ నుండి వైదొలిగారు.'' అని పేర్కొన్నారు. తమను మరోసారి మోసం చేశారని పుతిన్ అన్నారు. ఇప్పుడు ఎవరితో వ్యవహారం నడపాలి, ఎలా నడపాలి అనేది అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. ఎవరిని, ఎంత వరకు నమ్మవచ్చన్నారు. ఆ దిశగా తామిప్పుడు ప్రతి ఒక్క అంశాన్ని పరిశీలస్తున్నామని చెప్పారు. కీవ్‌కు సమీపంలో రష్యా బలగాలు ఉన్న సమయంలో పశ్చిమ దేశాలు వెనక్కి వెళ్ళాలని వత్తిడి తీసుకువచ్చాయని పుతిన్ గుర్తు చేశారు. ప్రత్యర్థి పక్షం మీ కణతపై తుపాకి గురి పెట్టినప్పుడు ఎలాంటి పత్రాలపై సంతకాలు చేయలేమని ఆ దేశాలు అన్నాయని చెప్పారు. మరుసటి రోజు తమ ఒప్పందాలను చెత్తబుట్టలో పారేసారని , ఇప్పుడు తాము తుది వరకు పోరాడుతామని చెపారు. ప్రస్తుతం



పశ్చిమ దేశాలు ఎలాంటి వైఖరి తీసుకున్నాయో ప్రపంచమంతటికీ తెలుసునని, యుద్ధ రంగంలో రష్యా ఓడిపోవాలని, వ్యూహాత్మకంగా ఓటమని చవి చూసేలా చేయాలని అవి చూస్తున్నాయన్నారు. తాము ఆ పద్ధతిలో వ్యవహరించలేదని పుతిన్ తెలిపారు.

**ఒప్పందాలపై ఎవరు సంతకాలు చేయాలి?**

ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కాలపరిమితి ముగిసిన తరువాత ఆయన చట్టబద్ధతను ప్రస్తావిస్తూ దీనిపై ఆ దేశ రాజకీయ, న్యాయ, చట్టబద్ధ వ్యవస్థలు సమాధానం ఇవ్వాలని పుతిన్ అన్నారు. ఇది నిజంగా ముఖ్యమైన అంశమేనని, పత్రాలపై సంతకాలు చేయాల్సి వచ్చినప్పుడు, ఇంతటి కీలక అంశంపై పత్రాల మీద చట్టబద్ధ యంత్రాంగం సంతకాలు చేయాలని చెప్పారు. కీవ్ యంత్రాంగం ఇప్పుడు సంక్షోభంలో చిక్కుకున్నారని అన్నారు.

**సమస్య పరిష్కారానికి షరతులా?**

ప్రస్తుత సమయంలో ఖార్‌ఖోవ్ నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రధానికలేవి తమ వద్ద లేవని పుతిన్ అన్నారు. చైనా పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉక్రేన్ అధ్యక్షుడు వ్లాదిమర్ జెలెన్స్కీ పదవీ కాలం పూర్తయిన తరువాత ఆయన చట్టబద్ధత ఏ మేరకు ఉంటుందో ఉక్రేన్ వ్యవస్థలు అంచనా వేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉక్రేన్ అంశాన్ని పరిష్కరించేందుకు మాస్కోపై కొన్ని షరతులు విధించేందుకు జరుగుతున్న ప్రయత్నాల పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రష్యా మిలిటరీ ఖర్చు పెరగడమనే పూర్తిగా సాధారణంగానే జరుగుతుందన్నారు.

## 20న ముగియనున్న జెలెన్స్కీ పదవీకాలం



**ఉక్రేన్:** ఉక్రేన్ అధ్యక్షుడు వ్లాదిమర్ జెలెన్స్కీ పదవీ కాలంలో మే 20వ తేదీన ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఉక్రేన్‌లో ఎవరితో చర్చించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐదేళ్ళ నిమిత్తం జెలెన్స్కీ 2019లో అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. సాధారణంగా కొత్త అధ్యక్షుడి కోసం మార్చి నెలలోనే ఎన్నికలు జరగాల్సి ఉన్నది. కాని రష్యాతో యుద్ధం కారణంగా ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికలు ప్రశ్నార్థకంగా మారాయి. ఉక్రేన్ మాజీ ఎంపి హ్రైయోరీ ఓమెల్ చెంకో ఇటీవల అధ్యక్షుడు జెలెన్స్కీకి లేఖ రాస్తూ రాజ్యాధికారాన్ని అక్రమంగా వినియోగించుకోవద్దని, మే నెలలో స్వచ్ఛంధంగా రాజీనామా చేయాలని కోరారు. ఉక్రేన్ రాజ్యాంగంలో ఈ అంశంపై కొంత అయోమయం నెలకొన్నదని నిపుణులు చెబుతున్నారు.

## పంచాయతీ ఎన్నికలు?

(మొదటి పేజీ తరువాయి)




నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్, 2గంటల తరువాత లెక్కింపు అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక చేపట్టనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 12,814 గ్రామపంచాయతీలుండగా, అందులో 88,682 వార్డులున్నాయి వీటన్నింటికి ఎన్నికలు జరగనున్నాయి. పంచాయితీ ఎన్నికలకు ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు అలాగే రేపు కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలుపనున్నట్లు తెలుస్తోంది.

## డ్రోగో డ్రోన్స్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. దేశ వ్యాప్తంగా ముఖ్యమైన జిల్లా కేంద్రాల్లో, ఆ తరువాత మండల కేంద్రాల్లో డ్రోన్ సర్వీస్ హబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు యశ్వంత్ తెలిపారు. డ్రోగో డ్రోన్స్ తాజాగా తయారు చేసిన కృషి 3 ప్రో డ్రోన్ ఒకసారి ఛార్జింగ్ చేస్తే నాలుగు ఎకరాల్లో క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తుందన్నారు. పూర్తిగా మందును నింపితే 24 నిమిషాలు, ఖాళీగా 42 నిమిషాలు గాల్లో ఎగురుతుంది. ఇప్పటి వరకు దేశంలో ఉన్న డ్రోన్లు ఒకసారి ఛార్జింగ్ చేస్తే రెండు ఎకరాల్లో మాత్రమే మందులను పిచికారీ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. నూతన డ్రోన్ తో రోజుకు 30 నుంచి 35 ఎకరాల్లో మందులను పిచికారీ చేయటంతో పాటు రైతులు 80 శాతం అధిక దిగుబడి పెంచుకునే అవకాశం ఉందని, సాధారణ డ్రోన్‌లను వినియోగించే పరిజ్ఞానం ఉన్న రైతులు కూడా క్రిషి డ్రోన్ ను ఆపరేట్ చేయవచ్చునని తెలిపారు. నూతన డ్రోన్ లో మందులను సమర్థంగా పిచికారీ చేసే నాజిల్స్, ఓవర్ ఫ్లో ను తెలిపే సెన్సార్లు , డ్రోన్ ఆకాశంలో ఉన్నపుడు అవాంతరాలు ఎదురైతే అప్రమత్తం చేసే వ్యవస్థ ఇమిడి ఉన్నాయని వెల్లడించారు. డ్రోగో డ్రోన్స్ నూతనంగా ఆవిష్కరించిన, ఇప్పటికి అందుబాటులో ఉన్న తమ డ్రోన్ల ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌ఘఢ్, కేరళ, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లోని 30 లక్షల ఎకరాల్లో పురుగు నివారణ మందుల పిచికారీకి ఇఫ్కో సంస్థతో ఒప్పందం చేసుకుందని యశ్వంత్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ ఖర్చుతో రైతులు డ్రోన్ సేవలు వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. దేశ వ్యాపితంగా డ్రోన్ సర్వీస్ హబ్ ఏర్పాటుకు తాము పెట్టుబడులు పెట్టమని, వెయ్యి మంది వుపేటర్లకు శిక్షణ ఇస్తామని యశ్వంత్ వెల్లడించారు. డ్రోగో డ్రోన్స్ తమ సేవలు మెరుగుపరిచేందుకు ఏ ఐ సాంకేతితకను జోడిస్తున్నట్లు తెలిపారు. వచ్చె ఏడాదికి 200 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నట్టు యశ్వంత్ వివరించారు .

## 'గులాబీ' భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌ఎలు, మరి కొందరు ముఖ్యనేతలు పార్టీని వీడుతారా?, లేదా? అనేది లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉంటుందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**బి టి బ్యాచ్ ఉంటుందా?....**

బంగారు తెలంగాణ బ్యాచ్(బిటి) పేరుతో బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నపుడు టిడిపి, కాంగ్రెస్ నుండి గెలుపొందిన కొందరు ఎంఎల్‌ఎలు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు గులాబీ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోగానే అనేక జిల్లాల్లో స్థానిక సంస్థల ప్రతినిధులు, కొందరు మేయర్లు, ఛైర్‌పర్సన్లు,ఛైర్మన్లు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మరి కొందరు కూడా బిఆర్‌ఎస్‌ను వీడేందుకు సిద్ధమైనప్పటికీ లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పరిశీలించిన తర్వాత వారు తమ రాజకీయ నిర్ణయం తీసుకోనున్నట్టు బిఆర్‌ఎస్ శ్రేణులు చెబుతున్నారు.

# విద్యారంగాన్ని సంస్కరించాలి

### సిఎంకు ఎఐఎస్‌ఎఫ్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యారంగంలో నెలకొన్న సమస్యలని పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్)రాష్ట్ర కౌన్సిల్ శుక్రవారం బహిరంగ లేఖ రాసింది. ఈ సందర్భంగా మీడియాతో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ..పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, విద్యారంగాన్ని గాడిలో పెట్టడానికి వెంటనే తగు చర్యలు తీసుకోవలని లేఖలో పేర్కొన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో విద్యా రంగాన్ని పాలకులు భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. వీసీల నియామకంలో రాజకీయ జోక్యం వుండరాని లేఖలో వారు తెలిపారు. ప్రైవేటు, కార్పోరేట్ కళాశాలల ఆగడాలను అరికట్టాలని, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్యా రంగం వరకు పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పాఠశాల అందుబాటులో వుండాలని, ఖాళీగా వున్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని,ప్రైవేటు, కార్పోరేట్ కళాశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలని,ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా తయారు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో బి కేటాగిరి సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని, యూనివర్సిటీలలో టీచిం,గ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, మెడికల్ కౌన్సిలింగ్లో ఎం.బి.బి.ఎస్., బి.డి.ఎస్.లతోపాటు హోమియోపతి, ఆయుర్వేదిక్, యూనాని, నేచూరోపతి కోర్సులకు కూడా ఒకేసారి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని కోరారు.

## ప్రశ్నలు ఎన్నో!

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముకోవాల్సి వస్తుందన్న ప్రధాని మాటలు, బిజెపికే సరిగ్గా సరిపోతాయి. ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేయకపోతే, మంగళసూత్రాలు అమ్మాల్సిన పరిస్థితి తప్పదేమో! కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, రాజ్యాంగాన్ని మార్చేసి, ముస్లిం రిజర్వేషన్లను అమాంతం పెంచేస్తుందన్నది మోదీ మరో వాదన. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి కోటాలో కోత విధించి, ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు పెంచుతుందని ఆయన ఆరోపణ. అయితే, స్వాతంత్ర్యం సిద్ధించిన 75 ఏళ్ల కాలంలో సుమారు 55 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీనే కేంద్రంలో అధికారంలో ఉండింది. ఒకవేళ ముస్లింలకు రిజర్వేషన్ కోటాను పెంచాలనుకుంటే, ఇంతకాలం ఆగేదా? ఆ పని ఎప్పుడో చేసి ఉండేది కదా? ఈ ఆరోపణలో ఏమాత్రం నిజం లేదని స్పష్టమవుతునే ఉంది. ముస్లిం రిజర్వేషన్లను ఎత్తివేస్తామన్నది ఎవరు? లౌకిక వాదాన్ని వ్యతిరేకిస్తున్నది ఎవరు? దేశ ప్రయోజనాలు నెరవేరాలంటే, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరం లేదా? దేశ ప్రజలంతా తన కుటుంబమని, అందరి అభ్యున్నతి తన బాధ్యతని ఒకవైపు ప్రకటిస్తున్న ప్రధాని, మరోవైపు ముస్లింలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంలో అర్థం ఏమిటి? 2014 ఎన్నికలసమయంలో, దేశ సంపదకు తాను చౌకీదార్ (కాపలాదారుడు)గా ఉంటానని మోదీ ప్రకటించారు. అయితే వేల కోట్ల రూపాయల పన్ను చెల్లింపుదారుల సొమ్మును దోచుకొని విదేశాలకు పరారైన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా తదితరుల కారణంగా, దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. వారిని ఇప్పటి వరకూ స్వదేశానికి రప్పించలేకపోయారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం కొమ్ముకాస్తున్నదనే ఆరోపణలకు బలాన్నిచ్చే మరో అంశం 2018లో తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్) ద్వారా అన్ని పార్టీల కంటే అత్యధిక మొత్తాలు బిజెపికే దక్కాయి. పరస్పర ప్రయోజనాలు (క్విడ్ ప్రో కో) అంశాన్ని ఇక్కడ విస్మరించడానికి వీల్లేదు. పేదలకు మేలు చేస్తామన్న బిజెపి హామీని నమ్మేది ఎవరు? 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమైన మోదీ సర్కారు, పరోక్షంగా రిజర్వేషన్లను దెబ్బతీసింది. ఉద్యోగావకాశాలు లేక, ఆదాయం లభించక ప్రజలు అల్లాడుతుంటే, స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరుగుదల, స్వయం సమృద్ధి సాధించడం వంటివి అసాధ్యాలుగా మిగిలిపోతాయి. హిందువుల బాధ్యత మొత్తం భుజాలకెత్తుకున్న రీతిలో మోదీ మాట్లాడడాన్ని గమనించవచ్చు. కాంగ్రెస్ గెలిస్తే, హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేస్తుందన్నది ఆయన ఆరోపణ. దేశంలో హిందూ జనాభా 78 శాతం. ఏ ఎన్నికల్లోనైనా ఇంత పెద్ద సంఖ్య ఫలితాలపై ప్రభావం చూపిస్తుంది. లౌకిక వాదాన్ని సక్రమంగా అమలు చేసినప్పుడు మత సామరస్యం సాధ్యమవుందా లేక విద్వేష ప్రసంగాల వల్లనా? ప్రధాని సమాధానం ఏమిటో? అయోధ్యలో రామ విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రతిపక్ష నేతలు హాజరు కాలేదు కాబట్టి, ఆ పార్టీలకు ఓటు వేయవద్దనడం అసందర్భంగా ఉంది. మళ్లీ గెలిస్తే మథుర, వారణాసి వంటి పుణ్యక్షేత్రాల్లో ఆలయాలు నిర్మిస్తామని హామీ ఇవ్వడం లౌకిక విధానమా లేక రాజ్యాంగ విఘాతమా? సందేశ్‌ఖలిలో మహిళలు అత్యాచారానికి గురై, కష్టాలను అనుభవించినందుకు బిజెపికి ఓటు వేయాలని మోదీ పిలుపునిస్తున్నారు. ఈ ఆరోపణల్లో నిజం ఉంటే, నిందితుడికి కఠిన శిక్ష పడాలి. కానీ, ఇప్పటి వరకూ సరైన సాక్ష్యాధారాలు లేవు. నేరం రుజువు కాలేదు. ఒకవేళ అదే నిజమనుకున్నా, కర్నాటకలో మిత్ర పక్షమైన జెడియు సిట్టింగ్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ కేసు ఏమిటి? రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణ ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ సింగ్ శరణ్ కుమారుడికి బిజెపి టికెట్ ఇవ్వడం ఏమిటి? మోదీ రాజకీయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ద్రవ్యోల్బణ పెరుగుదల నుంచి నిరుద్యోగం వరకూ అడుగడుగునా వైఫల్యాలతో ముందుకు సాగిన బిజెపి కొత్త వాగ్దానాలను నమ్మాలా? ఓటు వేయాలా? మళ్లీ గెలిపించాలా?

## అదే ఉదాసీనత

(మొదటి పేజీ తరువాయి)

కంటే 20 రోజులు లేటుగా వరి సాగు చేస్తారు.కోతకు కూడా లేటు గా వస్తుంది.అలాగే ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగడం లేదు.గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి ప్రకటించలేదు.ఇప్పుడేమో ధర్నాలు,ఆందోళనలకు బిఆర్‌ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటు..ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది.క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కోనేలా ప్రణాళికలు సిద్ధం చేయలేదు.దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు పంటను అమ్ముకోవడం అన్నదాలకు కష్టంగా మారింది.ఇప్పటికే ధరల హెచ్చుతగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా,పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.వరి పంట కొనుగోళ్లు సక్రమంగా లేవు.మద్దతు ధర పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది.మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది.ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్మల్ జిల్లాలో అన్నదాతలు ఆందోళన చేపట్టారు.ధాన్యం తూకం వేయకుండా,తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.అధికారులు,కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల తీరుకు నిరసనగా నిర్మల్ లో 61 జాతీయ రహదారిపై రైతులు బైఠాయించారు.ఐదు రోజులుగా ధాన్యం కొనుగోళ్ల నిలిచి పోయాయని,రెండు రోజులగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వాలని కోరుతున్నారు.తామే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు.సోసైటీ వాళ్లను అడిగితే రైస్ మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు.జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది.మొలకలు వస్తున్నాయి.అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాల్సి ఉంది.ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది.పలు గ్రామాల వారి జాప్యాన్ని తూకం వేసిన బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి,తూకలు వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు.వరి బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10 నుండి రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు.రాష్ట్రం అంతటా ఇదే దుస్థితి నెలకొంది.వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఊరటం కల్పించాల్సి ఉంది.ఈ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో అధికారులకు గట్టి ఆదేశాలు ఇవ్వాలి.

## సేకరించేలా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహాన్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## ఐదు రోజులు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతుందన్నారు. చక్రవాతపు ఆవర్తనం ఒకటి రాయలసీమ, పరిసర ఉత్తర తమిళనాడు ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమైందన్నారు. ఆవర్తనం ప్రభావంతోనే రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయన్నారు. నైరుతి ఋతుపవనాలు మే నెల 19వ తేదిన దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవుల వరకు పురోగమించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలతో పాటు భారీ వర్షాలు, శనివారం, ఆదివారం ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు అక్కడ అక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పారు. సంగారెడ్డి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, వనపర్తి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశామని చెప్పారు. ద్రోణి ప్రభావంతో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని వివరించారు. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## నిఘా పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు కలిసి నాటుసారాను మూడు నెలల్లో పూర్తి లేకుండా తుదముట్టించాలని అధికారులను అదేశించారు. నాటుసారా విషయంలో ప్రభుత్వం కూడా చాలా సీరియస్‌గా ఉందని తెలిపారు. నాటుసారాతోపాటు ఎన్నికల సందర్భంగా చాల ప్రాంతాల్లో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ వస్తున్నట్లుగా బహిర్గతమయ్యిందన్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను తెలంగాణలోకి రాకుండా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేకమైన నిఘా పెట్టి దాడులు నిర్వహించాలన్నారు. ఈ మధ్యకాలంలో పట్టణాల్లోను, ఫంక్షన్ హాల్స్, ఫాంహౌజ్‌లలో జరిగే పార్టీలకు మద్యం కావాలని దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్సైస్ శాఖ అనుమతులు ఇస్తుంది. కాని సగం మద్యాన్ని మద్యం దుకాణాల్లో తీసుకొని మిగిలిన సగం మద్యాన్ని నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ను వినియోగిస్తున్నారనే ప్రచారం జరుగు తుందని, పార్టీలు జరిగే ప్రదేశాల్లో ఎక్సైజ్శాఖ నిఘా పెట్టాలని కమిషర్ శ్రీధర్ సూచించారు. ప్రధానంగా వేసవిలో బీరు స్టాక్ లేదనే వార్తలు వస్తున్నాయని, రికార్డుల ప్రకారం పరిశీలిస్తే గత సంవత్సరం కంటే ఎక్కువ బీరు నిర్వలు ఉన్నట్లు చెపుతున్నాయని, ఈ విషయంలో అవసరమైన దాడులు నిర్వహించి మద్యం దుకాణాల్లో బీర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అదేశించారు. ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కోర్టు కేసులలో వాణిజ్య పన్నుల శాఖ సూచనలను పాటించాలని అన్నారు. నాటుసారా తయారీకి వినియోగించే ముడి సరుకుల రవాణపై ప్రత్యేక నిఘా పెంచి, దాడులు నిర్వహించి నాటుసారా తయారీని తుదిముట్టించాలని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అన్నారు. ఆగస్టు నాటికి పూర్తిగా నిర్మూలించడానికి ప్రణాళికలు రూపోందించుకొని కార్యాచరణ చేపట్టాలని అదేశించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని రవాణ కాకుండా చర్యలు చేపట్టాలని, కల్తీ కల్లు తయారీకి వినియోగించే సిహెచ్, అలం,డైజోఫాం లాంటి పదార్థాలను దాడులు నిర్వహించి పట్టుకోవాలన్నారు. గంజాయి, నార్కోటిక్, ఇతర మత్తు మందుల తయారీ, దిగుమతి, అమ్మకాలపై నిఘా పెట్టి పట్టుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ఆయా జిల్లాల్లో పోలీసుల సహకారం తీసుకొని నాటుసారా తయారీపై ఉక్కు పాదం మోపాలని కోరారు. సమావేశంలో తెలంగాణ జిల్లాల ఎసిలు, డిసిపలు, డిపిఇఒలు హాజరయ్యారు.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024



| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## వారణాసిలో అభ్యర్థులకు బెదిరింపులు



ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తు న్న వారణాసి లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగాలనుకుంటున్న వారికి బెదిరింపులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోదీకి, బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న వారణాసి మేయర్ పలువురు అభ్యర్థులను పోటీ చేయకుండా అడ్డుకుంటున్నారని, బెదిరిస్తున్నారని జ్యోతిమఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి పోటీకి ఎవరూ ఉండకూడదన్న రీతిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నామినేషన్ వేసిన వారిని కూడా భయభ్రాంతులకు గురి చేస్తూ, పోటీ నుంచి వైదొలగేలా ఒత్తిడి తెస్తున్నారని స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రుళ్లు అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి, తలుపుకొట్టి మరీ బిజెపి కార్యకర్తలు బెదరిస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాలను చూస్తుంటే, దేశంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అనే అనుమానం తలెత్తుతున్నదని స్వామి వ్యాఖ్యానించారు. ప్రధాని బరిలో ఉన్న వారణాసి స్థానానికి మొత్తం 43 నామినేష న్లు దాఖలు కాగా, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ఏకంగా 36 నామినేషన్లను తిరస్కరించింది. మోదీ మిమిక్రీతో విపరీతమైన క్రేజ్‌ను సంపాదించిన శ్యామ్ రంగీలా నామినేషన్ కూడా వాటిలో ఒకటి. కాగా, ప్రస్తుతానికి వారణాసి నుంచి మొత్తం ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. కాంగ్రెస్ తరపున ఐదు పర్యాయాలు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ సభ్యుడిగా ఉన్న అజయ్ రాయ్ పోటీపడుతున్నారు.

## షా ఇన్.. యోగి అవుట్!



బిజెపిలో అంతర్గత వ్యవహారాలు ఎప్పుడు, ఎలాంటి మలుపు తిరుగుతాయో ఎవరికీ తెలియదు. నిన్న మొన్నటి వరకూ దేశ ప్రధానిగా మోదీ నుంచి బాధ్యతలు తీ సుకోగల స్థాయి నాయకుడు ఎవరన్న ప్రశ్నకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేరు ప్రముఖంగా వినిపించేది. పార్టీ శ్రేణులేకాదు.. సామాన్య ప్రజలు కూడా మోదీ తర్వాత యోగి చేతికి పగ్గాలు వస్తాయని అనుకుంటున్నారు. కానీ, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో యోగి పాత్ర నామమాత్రంగానే ఉంది. మోదీ స్థానంలో ప్రధాని కుర్చీలో అమిత్ షా కూర్చుంటారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అందుకు కారణాలు లేకపోలేదు. మోదీ ఇప్పుడు అమిత్ షాకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన కూడా 'సెకండ్ నేనే' అన్న చందంగా వ్యవహ రిస్తున్నారు. వారణాసి నుంచి నామినేషన్‌ను ఫైల్ చేసే సమయంలో మోదీ తన పక్కనే జ్ఞానేశ్వర్ శాస్త్రి అనే సాధువును కూర్చోబెట్టుకున్నారు. ఆయనతోనే ఎక్కువ సేపు మాట్లాడుతూ కనిపించారు. యోగిది ప్రేక్షక పాత్రే అయింది.

# అందరి దృష్టీ రాయ్‌బరేలి, అమేథీల మీదే



వచ్చే సోమవారం ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్న 14 లోక్‌సభ స్థానాలలో రాయ్‌బరేలి, లక్నో, అమేథీలో కీలకమైనవి. ఈ మూడు నియోజకవర్గాలు కాకుండా మోహన్‌లాల్ గంజ్, హమీర్‌పూర్, జాలౌన్, ఝూన్సీ, బందా, ఫతేపూర్, కౌశాంబి, ఫైజాబాద్, బారాబంకీ, కైసర్ గంజ్, గోండా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో రాయ్‌బరేలి మినహా 13 స్థానాలను బిజెపి కైవసం చేసుకుంది. రాయ్‌బరేలి నుండి కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ గెలిచారు. రాయ్‌బరేలి, అమేథీ నియోజకవర్గాలు గాంధీ కుటుంబానికి మారుపేర్లుగా నిలిచాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు ఈ రెండు నియో జకవర్గాలలో ప్రచారం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు. 2019 ఎన్నికలలో సోనియాగాంధీ 1.67 లక్షల మెజారిటీతో గెలుపొందిన రాయ్‌బరేలి ఒక్కటే భారతదేశంలో అత్యంత రాజకీయ ప్రాధాన్యత కలిగి, అత్యధిక స్థానాలు కలిగిన ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలుచుకున్న ఏకైక స్థానం. ఈ సారి ఆ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ కీలక నేత, సోనియగాంధీ కుమారుడు రాహుల్ గాంధీ పోటీలో నిలిచారు. గత ఎన్నికల్లో ఆయన పొరుగున ఉండే అమేథీ నియోజకవర్గంలో స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు.అమేథీ నుండి రాయ్ బరేలీ స్థానానికి మారినందుకు రాహుల్‌గాంధీని అవహేళన బిజెపి, 20ఎన్నికల్లో 17సార్లు గెలిచి న రాయ్‌బరేలిలో కూడా ఈసారి కాంగ్రెస్‌ను ఓడిస్తామని చెప్పుకుంటోంది. అమేథీ, రాయ్‌బరేలిలో గాంధీ కుటుంబం ఏమీ చేయలేదని,తపుడు వాగ్దానాలు చేయడంలో ఆ కుటుంబం నిష్ణాతులు అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నిందించారు. తాము అక్కడ నుండి గెలిచి రాయ్‌బరేలిని నంబర్ వన్‌జిల్లాగా తీర్చిదిద్దుతామని ఎన్నికల ప్రచార సభల్లో చెబుతున్నారు. ఆ నియోజకవర్గంలో రాహుల్ గాంధీని ఓడించేందుకు బిజెపి సకల విధాలుగా ప్రయత్నిస్తుంది. ఇటీవల రాయ్‌బరేలిలో ప్రచార సభ అనంతరం అమిత్‌షా స్థానిక సమాజ్‌వాదీ పార్టీ ఎంఎల్‌ఏ మనోజ్ పాండే నివాసానికి వెళ్ళారు. గత ఫిబ్రవరి మాసంలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి అనుకూలంగా ఓటేసేందుకు మనోజ్ పాండే ఎస్‌పి ఛీఫ్ విప్ పదవికి రాజీనామా చేశారు. సంప్రదాయంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్న రాయ్‌బరేలి నియోజకవర్గంలోని 11 శాతం బ్రాహ్మణ ఓటర్లను ఆయన ప్రభావితం చేస్తారని భావిస్తున్నారు. రాయ్‌బరేలి, అమేథీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రియాంక గాంధీ నేతృత్వం వహిస్తుండడం ద్వారా కాంగ్రెస్ క్యాడర్‌ను ఉత్సాహపరుస్తున్నారు. గతంలో ఉత్తర్ ప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరించిన ఆమె ప్రతి రోజు 10 చొప్పున వీధి చివర సభలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాలతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని పదే పదే గుర్తు చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. వీటితో తమకు ఉన్న వందేళ్ళ బంధాన్ని ఎవరూ విడగొట్టలేరని గట్టిగా చెబుతున్నారు. అమేథీ నుండి బిజెపి సిట్టింగ్ ఎంపి, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి వ్యతిరేకంగా తమకు అత్యంత విశ్వాస పాత్రుడైన కిశోరీ లాల్ శర్మను కాంగ్రెస్ తరుపున గాంధీ కుటుంబం బరిలో నిలిపింది. మీ ఎంపి ఎవరైనప్పటికీ, ఎలాంటి రాజకీయాలు చేస్తున్నప్పటికీ, 2వేలకు పైగా తప్పుడు కథనాలను తమకు వ్యతిరేకంగా వ్యాప్తి చేస్తున్నప్పటికీ, అమేథీ తమ బంధం తెగిపోదని ప్రియాంక గాంధీ ఎన్నికల సభల్లో భావోద్వేగంగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుండి స్మృతి ఇరానీ 55వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మరో కీలక నియోజకవర్గం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నో నుండి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వరుసగా మూడవసారి విజయం సాధించేందుకు ఉవ్విళూరుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా సమాజ్‌వాదీ పార్టీ నుండి రవిదాస్ మెహ్రోత్రా, బిఎస్‌పి నుండి సర్వార్ మాలిక్‌లు రంగంలో ఉన్నారు. ఒకప్పుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ప్రాతినిధ్యం వహించిన లక్నో బిజెపికి కంచుకోట. గత ఎనిమిది ఎన్నికల్లో బిజెపి ఈ స్థానం నుండి ఒక్కసారి కూడా ఓటమి చవిచూడకపోవడం విశేషం. గత ఎన్నికల్లో రాజ్‌నాథ్ సింగ్ సమీప ఎస్‌పి అభ్యర్థి పూనమ్ సిన్హాపై 3.47 లక్షల తేడాతో గెలుపొందారు. మరో ముఖ్య నియోజకవర్గం కైసర్‌గంజ్‌లో వివాదాస్పద రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపి బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ కుమారుడు కరణ్ భూషన్ సింగ్ పోటీ చేస్తున్నారు. ఆయనతో ఎస్‌పి అభ్యర్థి భగత్ రామ్ మిశ్రా, బిఎస్‌పి అభ్యర్థి నరేంద్ర పాండేలు తలపడుతున్నారు.

మహిళా రెజ్లర్లపై లైం గిక వేధింపులు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎ దుర్కొని, దేశవ్యాప్తంగా అభాసుపాలైన బ్రిజ్ భూ షణ్ సూచించిన ఆయన కుమారుడికే బిజెపి టికె ట్ ఇచ్చింది. ఆయన తన కుమారుని విజయం కో సం విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, బిజెపి శ్రేణులు, స్థానిక బిజెపి ఎంఎల్‌ఏలు అంటీముట్టనట్లుగా ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఝూన్సీ నియోజకవర్గంలో బిజెపి ఎంపి అనురాగ్ శర్మపై ఇండియా కూటమి తరుపున కాంగ్రెస్ అభ్యర్థి కేం ద్ర మాజీ మంత్రి ప్రదీప్ జైన్ ఆదిత్య పోటీ చేస్తున్నారు. ఫతేపూర్ లోక్‌సభ స్థానంలో కేంద్ర మంత్రి , బిజెపి సిట్టింగ్ ఎంపి సాధ్వీ నిరంజన్ జ్యోతితో ఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు, యాదవేతర ఒబిసి నేతగా ప్రజాదరణ పొందిన నరేశ్ ఉత్తమ్ పటేల్ తలపడతున్నారు.

### వక్ఫ్ బోర్డు వర్సెస్ కాథలిక్ చర్చ్

## భూములు ఎవరికి ఎక్కువ?




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ గెలిస్తే దేశ ఆదాయాన్ని, సం పదను ముస్లిం మైనారిటీలకు అప్ప చెప్తుందని, ఇప్పటికే ఆ వర్గానికి భారీగా మద్దతు లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఏదో ఒక రకంగా ముస్లిం మైనారిటీలను ప్రస్తావిస్తూ, వారి నుంచి ప్రమాదం పొంచి ఉందని, సంపదను వారు కొల్లగొడతారని హిందువులను భయభ్రాంతులను చేయ డం ద్వారా ఇప్పుడు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే తాపత్ర యం ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. అయితే, ముస్లిం వక్ఫ్ బోర్డు కంటే కాథలిక్ చర్చ్ ఆఫ్ ఇండియా ఆధీనంలోనే ఎక్కువ భూమి ఉంది అనేది నిజం. దేశంలో భారత ప్రభుత్వం తర్వాత ఎక్కువ భూమి కాథలిక్ చర్చ్‌కే ఉందని గవర్నమెంట్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ వెబ్‌సైట్‌లోని వివరాలు స్పష్టం చేస్తున్నాయి. దేశ స్వాతంత్ర్యానంతరం ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభు త్వ భూములను వక్ఫ్ బోర్డులకే కట్టబెట్టిందనే అ భిప్రాయాన్ని బిజెపి విస్తృతంగా ప్రచారం చేసింది. కానీ, కాథలిక్ చర్చ్‌కి ఎక్కువ భూమి ఉన్నట్టు అధికారిక వివరాల ద్వారా తెలుస్తోంది. 2021 ఫిబ్రవరి నాటికి దేశ వ్యాప్తంగా 7 కోట్ల హెక్టార్ల (17.29 కోట్ల ఎకరాలు) కాథలిక్ చర్చ్ ఆధీనంలో ఉండగా, భారత ప్రభుత్వం దాదాపు 15, 531 చదరపు కిలోమీటర్ల భూమిని కలిగి ఉంది, వివిధ ప్రభుత్వ రంగసంస్థలు, మంత్రిత్వ శాఖలు దానిలో కొంత భాగా న్ని ఉపయోగించుకుంటున్నాయి. దీనికి విరుద్ధంగా, కాథలిక్ చర్చ్ విస్తారమైన ల్యాండ్ పోర్ట్‌ఫోలియోలో చర్చిల నుం డి కళాశాలలు, పాఠశాలలు వంటి విద్యా సంస్థల వరకు విభిన్నమైన సంస్థలు, రంగాలు ఉన్నాయి. ఈ భూమలు విలువ సుమారు రూ.20,000 కో ట్లు ఉంటుందని అంచనా. కాథలిక్ చర్చ్ భూ యాజమాన్య మూలాలు 1927 ఇండియన్ చర్చ్ చట్టానికి లోబడి ఉన్నాయి. అంటే స్వాతంత్ర్య పూర్వమే కాథలిక్ చర్చ్‌కి ఎక్కువ భాగం భూమి లభించింది. చర్చ్ భూములను ప్రభుత్వం స్వాధీ నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నదన్న విమర్శలు కేంద్రంలో బిజెపి రాక ముందు వినిపించాయి. పోప్ ఫ్రాన్సిస్ నాయకత్వంలో, కాథలిక్ చ ర్చ్ బిషప్స్ ఆఫ్ ఇండియా (సిబిసిఐ) ఈ భూములను నియంత్రిస్తున్నది. గోవా నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకూ ఈ భూ ములు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి సంస్థలు సిబిసిఐ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

దీనికి అనుబంధం గా 2457 హాస్పిటల్ డిస్పెన్సరీలు, 240 మెడికల్ లేదా నర్సింగ్ కాలేజీలు, 28 జనరల్ కాలేజీలు, 5 ఇంజినీరింగ్ కాలేజీలు, 3765 మాధ్యమిక పాఠశాలలు, 7319 ప్రాథమిక పాఠశాలలు, 3187 నర్సరీ స్కూల్స్ ఉన్నాయని సమాచారం. ఈ వాస్తవాలను మరుగునపెట్టి, వక్ఫ్ బోర్డుకు, మైనారిటీ విద్యా సంస్థలకు భూమలు కట్టబెడుతున్నారని ప్రధాని మోదీ ఆరోపించడంలో అర్థం లేదు.

## బిసి రిజర్వేషన్లు పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

### జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతాలని పెంచాల ని, అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని 13 బిసి సంఘాలు, 30 కుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సమావేశానికి లాల్ కృష్ణ, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యతిధిగా జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ప్రభుత్వం జూన్ నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించిన నేపథ్యంలో కులగణన చేసి ఆ గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని వారు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జ రుపుతారని, స్థానిక సంస్థల ఎన్నికలకు తొందరగా ఏముందని వారు ప్రశ్నించారు. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగ సభలలో కులగణన జరుపుతామని, దాని ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని, బడ్జెట్ కేటాయిస్తామని, బిసి ఎజెండా ఎత్తుకుని బిసిల అభిమానం చూర గోంటుంటే తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు అన్యాయం చేయడం తగదన్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 45శాతం ప్రాతినిధ్యం కల్పించారని, జనరల్ స్థానాలలో కూడా బిసి జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపిపి చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు ఇస్తుంటే తెలంగాణాలో ఎన్నికల వాగ్దానం ప్రకారం రిజర్వేషన్లు పెంచకుండా అన్యాయం చేయడం సరైంది కాదన్నారు.

విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పుడు ఉన్న 13 కార్పొరేషన్లకు తోడుగా మరో 40 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న 11 పెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిసి నాయకులు నీల వెంకటేష్, రాజ్ కుమార్, నందు గోపాల్, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌మెంట్ పెంచండి

### తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు మఠం రవీంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి హరీశ్‌కుమార్ రెడ్డి, చైర్మన్ ఎ.పద్మాచారి, ఉపాధ్యక్షుడు జి.జాకబ్, ప్రతినిధులు జి.మహేష్‌కుమార్, పద్మ, నిర్మల, కిషోర్‌కుమార్, బోరేద ప్రవీణ్ కుమార్, రాధాకృష్ణ, నాగరాజు, ఎన్. నర్సింగరావు ఆధ్వర్యంలో పిఎసి ఛైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, రుణాల అడ్వాన్స్‌ను పెంచాలని, లీవ్ ట్రావెల్ అటవెన్సును మంజూరు చేయాలని, తదితర సమస్యలను, డిమాండ్‌ను పిఎసి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్టు వారు తెలిపారు.

**అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ వేతనాలు పెంచండి:** అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని తెలంగాణ సెక్రెటరియేట్ అవుట్ సో ర్సింగ్ ఎంప్లాయీస్ అసో సియేషన్ అధ్యక్షుడు కె.రమేష్, ఉపాధ్యక్షుడు ఎస్.పి. వేణుగోపాల్ రాజు, రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి జె.అనిత, కార్యదర్శులు డి.సునీత, కె.కృష్ణ నాయక్ తదితరులు పిఆర్‌ఎసి ఛైర్మన్ శివశంకర్‌కు శుక్రవారం వినతిపత్రంఅందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తాము పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రతలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# గెలిస్తే అర్జునుడిని.. ఓడితే అభిమన్యుడిని అవుతా..

### గెలిచినా, ఓడినా చరిత్రలో నిలిచిపోతా.. నిజామాబాద్ ఎంపి అభ్యర్థి జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి:** నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నిక పద్మవ్యూహమని, ఇక్కడ గట్టి పోటీ ఉంటుందని తెలిసి కూడా పోటీ చేశానని, గెలిస్తే అర్జునుడిని అవుతా.. ఓడితే అభిమన్యుడిని అవుతాయని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ నుండి ఓడినా, గెలిచినా చరిత్రలో నిలిచిపోతానని పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాలలో జీవన్ రెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ నిజామాబాద్ సిట్టింగ్ ఎంపి బిజెపిదేనని తెలిసి రాజకీయంగా జన్మనిచ్చిన జగిత్యాల ప్రజలకు సేవ చేయాలనే తపనతో నిజామాబాద్ నుండి పోటీ చేశానని, ఇక్కడ టఫ్ ఉన్నప్పటికి అందరి ఆశీర్వాదంతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక ప్రణాళికతో రైతులకిచ్చిన హామీని నిలబెట్టేందుకు రెండు లక్షలు రుణ మాఫీ చేసి తీరుతామని తెలిపారు. మద్దతు ధరకు అదనంగా రూ.లు 500 బోనస్ ఇస్తామని, ధాన్యం తూకంలో కోత లేకుండా సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రైతులను విస్మరించిన బిఆర్‌ఎస్ పార్టీ రైతు దీక్షలు చేయడం, దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని జీవన్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నిలువరించేందుకే బిఆర్‌ఎస్ బిజెపికి అమ్ముడు పోయిందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ పాలనలో వరి వేస్తే ఉరి అని, కేవలం సన్నరకాలే సాగు చేయాలని, లేకుంటే ధాన్యం కొనుగోలు చేయమని చెప్పి, చెరువుల్లో తూములు, బందు చేసి రైతులను ఇబ్బంది పెట్టి, ఐదేళ్లు పూర్తి అయిన పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని, కేసిఆర్ సన్నరకాలు సాగు చేస్తే ఏ విధమైన ప్రోత్సాహం ఇవ్వలేదని, సన్నరకాలకు రూ.లు 500 బోనస్ ఇస్తామంటే బిఆర్‌ఎస్ నాయకులు దీక్షచేపట్టడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో బిఆర్‌ఎస్ పార్టీపై ధ్వజమెత్తారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా క్వింటాల్‌కు 3వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని, చెబుతూ కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మూడువేలు మద్దతు ధర ఇస్తామని స్పష్టం చేశారు. స్వామినాథన్ సిఫార్సులు పరిగణనలోకి తీసుకోవడం లేదని, ఆయనకు భారత రత్న ఇచ్చి సూచనలు అమలు చేయకపోవడం హాస్యాస్పదమన్నారు. రైతులకు మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని, రైతులకు అండగా నిలవాలని రూ.లు 500బోనస్ ప్రకటిస్తే ఎట్లా ఇస్తారని విమర్శించడం సరికాదన్నారు. పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా రీసైక్లింగ్ అరికట్టాలని అప్పుడే వినియోగదారుడు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటారని జీవన్ రెడ్డి అన్నారు. సన్నరకాల సాగు ఖరీఫ్‌లోనే చేస్తారన్న విషయం కేసిఆర్‌కు తెలుసో తెలియదోనని, ఖరీఫ్ పంట నాటికి రెండు లక్షల రుణ మాఫీ చేయాలని సియం రేవంత్ రెడ్డి నిర్మాణాత్మకంగా కార్యాచరణ రుపొందించి, చర్యలు చేపడుతున్నామని రైతులకు అండగా నిలిచేందుకు రైతు భరోసా అమలు చేశామని, ప్రభుత్వం అప్పు తీసుకువచ్చి అయినా రుణ మాఫీ చేస్తామన్నారు. గతంలో క్వింటాల్‌కు 10కిలోల ధాన్యం అదనపు తూకం వేసింద్రని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి కోత లేకుండా సేకరిస్తుందని అన్నారు. ఈ ఏడాది అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని చెప్పారు. కల్లాల వద్ద ఇబ్బందులు లేకుండా తడిసిన ధాన్యం సేకరించేలా, రైతులు ఆందోళన పడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులకు అండగా నిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును బిఆర్‌ఎస్ జీర్ణించుకోలేక, ఉనికి కాపాడుకోవాలని దీక్షలు చేస్తుందని, ప్రతిపక్షాలు బాధ్యతతో వ్యవహరించాలని హితవు పలికారు. డెడ్ స్టోరేజి నుండి కూడా నీరు విడుదల చేసి పంటలను కాపాడామని పేర్కొన్నారు. బిజెపికి సిద్ధాంతం లేదని, కేవలం మత విద్వేషాలు, రెచ్చగొట్టే రాజకీయం చేయడం మినహా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉచిత విద్యుత్, బోనస్ ఇస్తుందా,మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తుందా అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పని చేస్తుందని, భారత దేశ అభివృద్ధికి బాటలు వేసింది కాంగ్రెస్ పార్టీని జీవన్ రెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, దుర్గయ్య, జున్ను రాజేందర్, చిట్ల అంజన్న, జితేందర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌లో పట్టభద్రుల ఉప ఎన్నిక చిచ్చు

### అభ్యర్థి ఎంపికపై గులాబీ నాయకుల ఆగ్రహం
### పల్లా వర్గం నేతకు టికెట్ పట్ల అసంతృప్తి
### కెటిఆర్‌తో భేటీకి పలువురు గైర్హాజరు
### ఉప ఎన్నికపై ప్రభావం చూపుతుందని ఆందోళన





**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి /జనగామ ప్రతినిధి:** పోటీకి ముందే వరంగల్,నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బిఆర్‌ఎస్‌లో చిచ్చు రేపింది. అభ్యర్థి ఎంపిక విషయంలో ఆ పార్టీలోని నాయకులు తలోదారి అన్న చందంగా మారిపోయింది. తమను సంప్రదించకుండా ఏకపక్షంగా అభ్యర్థిని ప్రకటించి గెలిపించుకురండి అంటే ఎలా కుదురుతుందంటూ అధిష్టానంపై గులాబి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నిర్వహించిన సమావేశాన్ని పలువురు ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 27న జరుగనున్న వరంగల్ ఖమ్మం నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఉప ఎన్నికకు అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి నుంచి బిఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని అధిష్టానం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. గతంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేసిన రాకేష్‌రెడ్డికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరుడిగా పేరుంది. దీంతో కొందరు గులాబీ నేతలు తమపై పల్లా రాజేశ్వర్ రెడ్డి పెత్తనమేంటని జిల్లా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తుల కారణంగా గతంలో నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్సీ స్థానంలో బిఆర్‌ఎస్ ఎదురీదుతోందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గులాబి పార్టీకి అగ్ని పరీక్షగా మారింది. శాసనమండలి పునరుద్దరణ తరువాత వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2007, 2009లో జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. అనంతరం 2015, 2021లో వరుసగా రెండు సార్లు పల్లా రాజేశ్వర్ రెడ్డి బిఆర్‌ఎస్ తరపున పోటీచేసి గెలిపించారు. ఇలా నాలుగు సార్లు జరిగిన ఎన్నికల్లో ఓటమితో పాటు ప్రస్తుతం కీలక నేతలు పార్టీని వీడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీఆర్‌ఎస్ ప్రతిష్టకు పరీక్షగా మారింది. దీంతో ఈ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు గులాబి పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది.

**పల్లా పెత్తనంపై గులాబీ నేతల గుస్సా**

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవీకి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నికల జరుగుతుండగా ఈ సీటుపై కన్నేసిన పలువురు బిఆర్‌ఎస్ నాయకులు గ్రౌండ్ వర్క్ చేసుకున్నారు. వరంగల్‌కు చెందిన వికలాంగుల కార్పోరేషన్ మాజీ ఛైర్మన్, కేయూజాక్ నేత వాసుదేవరెడ్డితోపాటు కుడా మాజీ ఛైర్మన్ సుందర్‌రాజ్, నల్లగొండ జిల్లాకు చెందిన గీత కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, చెరుకు సుధాకర్ టికెట్ ఆశించారు. అధినేత కెసిఆర్ మాత్రం అనూహ్యంగా రాకేష్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. దీంతో వరంగల్ నల్గొండ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉద్యమ సమయం నుంచి పనిచేస్తున్న తమను కనీసం సంప్రదించకుండా టికెట్ ఖరారు చేయడమేంటని గులాబీ నేతలు గుర్రుగా ఉన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు తాము సూచించిన వ్యక్తికి టికెట్ ఇవ్వలేదంటూ వాపోతున్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నపుడు కాపాడుకున్నామని, పల్లా కారణంగా తమకు అధిష్టానం వద్ద ప్రాధాన్యం తగ్గుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కెటిఆర్‌తో భేటీకి పలువురు గైర్హాజరు**

ఈ క్రమంలో కెటిఆర్‌తో భేటీకి పలువురు గైర్హాజరు అయ్యారు. ఈ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని నాయకులతో సమన్వయంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఈనెల 15న తెలంగాణ భవన్‌లో నిర్వహించిన స మావేశానికి పలువురు ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్‌ఎస్ నాయకులు దూరంగా ఉన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లితోపాటు ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరా జు సారయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, మర్రి యాదవ రెడ్డి తదితరు ఆ సమావేశానికి గైర్హాజరయ్యారు. వారంతా పలు వ్యక్తిగత కారణాలు చెప్పినా అభ్యర్థి ఎంపిక పట్ల అసంతృప్తితోనే దూరంగా ఉన్నారన్న అభిప్రాయాలు వ్య క్తమవుతున్నాయి. ఇవి అధిష్టానంలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికపై వీటి ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

ప్రజాపక్షం
శనివారం, మే 18

# చెప్పేటందుకే నీతులు ఉన్నాయా!

'ప్రధాని నరేంద్రమోదీ 2025లో 75 సంవత్సరాల వయస్సు రాగానే పదవినుండి తప్పుకోరు – ఆ తర్వాత కూడా కొనసాగుతారు' – అన్నారు ఆయన ముఖ్య అనుయాయి, క్యాబినెట్‌లో నెం.2గా ఉన్న హోంమంత్రి అమిత్ షా. ఆయన భారతీయ జనతా పార్టీ పూర్వాధ్యక్షుడు కూడా. మోదీతో పాటే గుజరాత్ నుంచి కేంద్ర రాజకీయాల్లోకి వచ్చారు. మోదీ రెండవ పదవీకాలంలో పార్టీ అధ్యక్ష పదవి విడిచి హోంమంత్రి బాధ్యతల్లోకి వచ్చారు. ఆయన తొలి ఘనకార్యం ఆర్టికల్ 370 రద్దు. మోదీ వారసునిగా సర్వాంగీకార సన్నద్ధతలో ఉన్నాడని భావించబడుతోంది. అటువంటి వ్యక్తి 75 ఏళ్ల వయోపరిమితి మోదీజీకి వర్తించదని చెప్పటంలో ఆంతర్యమేమిటో ఊహించుకోవలసిందే. మోదీయే బిజెపి అన్నంతగా వ్యక్తిపూజ పరాకాష్టకు చేరినందున, ఎన్నికల మధ్యలో ఆయన రిటైర్మెంట్ ప్రస్తావన రావటమే బిజెపి వారిని ఇరకాటంలో పెట్టి ఉంటుంది. ఆ మాట ప్రచారవ్యాప్తిలోకి వచ్చేలోపే మొగ్గలోనే తుంచేసే ఉద్దేశంతో షా ఆ ప్రకటన చేసి ఉంటారు.

'మోదీజి 2025 సెప్టెంబర్ 17న 75 సంవత్సరాల వయస్సు మీరుతారు. 2014లో ఆయనే స్వయంగా విధించిన సూత్రం ప్రకారం ఆయన క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగాలి. అమిత్ షాకు పట్టాభిషేకం చేస్తారు' అని దేశ ప్రజలకు గుర్తుచేసిన వ్యక్తి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. మోదీకేమి, సంపూర్ణారోగ్యంతో దుక్కలా ఉన్నాడు. రోజుకు 3–4 ఎన్నికల సభల్లో చెప్పింది చెప్పకుండా, ఒక సభలో చేసిన ఆరోపణను మరో సభలో ఖండిస్తూ అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్టను పెంచాడు. స్వపక్షీయులచే విశ్వగురువుగా కీర్తించబడుతున్నాడు. ఆయన ఎందుకు రిటైర్‌కావాలని అడ్డంపడే భక్తులకు, జీవించినంతకాలం ఆయనే దేశానికి ప్రధాని, కాదంటే రాష్ట్రపతిగా ఉండాలని కోరి కొబ్బరికాయలు కొట్టేవారికి, లేదంటే దేశానికి దిక్కు లేదని బొబ్బలు పెట్టేవారికి కొదువలేదు. కాని 75 సంవత్సరాలకు రిటైర్మెంట్ అని నియమం విధించి, కచ్చితంగా అమలుచేసి సీనియర్ నాయకులు, పార్టీ నిర్మాణం కోసం జీవితం వెచ్చించిన ఎల్.కె. అద్వానీ, మురళీమనోహర్ జోషి ఇత్యాదులను ప్రజాజీవితానికి దూరంచేసిన వ్యక్తి నరేంద్రమోదీయే కదా! అటువంటప్పుడు ఆ నియమం నుండి ఆయనకు మినహాయింపు యిచ్చే అధికారం అమిత్‌షాకు ఎవరిచ్చారు?

కేజ్రీవాల్ కథనం ఆసక్తికరంగానే ఉంది. ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో ఎన్నికలొచ్చినా మోదీ, షా తదుపరి స్టార్ కాంపెయినర్‌గా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రచార సభల్లో పాల్గొనేవారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన స్వరాష్ట్రం దాటి కాలు బయటపెట్టలేదు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చినట్లయితే రెండు నెలల్లో యోగిని ముఖ్యమంత్రి పదవి నుండి తొలగిస్తారని కేజ్రీవాల్ అన్నారు. మోదీ వారసునిగా అమిత్‌షా బాటకు యోగి అడ్డు తొలగించాలనే అభిప్రాయానికి బిజెపి నాయకత్వం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. మోదీ కొంతకాలంగా ఈ పథకంపై పనిచేస్తున్నారని ఆరోపిస్తూ, శివరాజ్‌సింగ్ చౌహాన్, వసుంధరరాజె, రమణ్‌సింగ్, దేవేంద్ర పడ్నావిస్, మనోహర్‌లాల్ కట్టార్‌లను ఇప్పటికే పక్కనపెట్టారని కేజ్రీవాల్ ఉదహరించారు.

కేజ్రీవాల్ ఊహలన్నీ జైలుకెళ్లి వచ్చిన సైడ్ ఎఫెక్ట్స్ అని ఆదిత్యనాథ్ ఎద్దేవా చేశారు. ఆయన నా గురించి బాధపడటం మానుకుని తన పార్టీ గూర్చి ఆందోళన చెందాలని చురక అంటించారు. భిన్నమైన పార్టీ అనే టాగ్‌ను బిజెపి మోదీకాలంలో కోల్పోయింది. చెప్పేటందుకే నీతులు ఉన్నాయన్నట్లు స్వప్రయోజనంకోసమే మోదీ 75 సం. నియమం విధించారా లేక పాటించి నిజాయితీని చాటుకుంటారా? పదవీలాలస తప్ప నీతి – నియమాలు కోల్పోతున్న రాజకీయ వ్యవస్థలో ఏమైనా జరగవచ్చు.

## క్రైస్తవ సంతుష్టీకరణ
# బిజెపి ఇలాంటి పనులు కూడా చేస్తుందా!


ఎం. కోటేశ్వరరావు

నాగాలాండ్ ! ఈశాన్య రాష్ట్రాలలో ఒకటి. జనాభా ఇరవైలక్షలకు పైబడి. భాషలెన్నో తెలుసా 17, అక్షరాలా పదిహేడు. ఆంగ్లం అధికార భాష, అత్యధికులు గిరిజనులే. 2011 జనాభా లెక్కల ప్రకారం 87.92 శాతం మంది క్రైస్తవులు, 8.75శాతం హిందువులు. ఇప్పుడు ఈ చిన్న రాష్ట్రం గురించి ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే.... తమ పూర్వీకుడు, జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులలో ఒకరైన శ్యామ ప్రసాద ముఖర్జీ జూన్ 23న 70వ వర్ధంతిని పురస్కరించుకొని మే 11న రాష్ట్రంలోని చర్చిలను శుభ్రపరచాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బెంజమిన్ యప్తోమి తమ పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. దీని మీద మీ మహత్తర సేవలను వేరే చోట ఉపయోగించాలని నాగాలాండ్ బాప్టిస్టు చర్చి కౌన్సిల్ సున్నితంగా తిరస్కరించింది. నాగాలాండ్‌లో నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డిపిపి) అనే ప్రాంతీయ పార్టీతో కలసి సంకీర్ణ ప్రభుత్వంలో బిజెపి ఉంది. నరేంద్రమోదీ 2014లో అధికారానికి వచ్చిన తరువాత క్రైస్తవుల మీద అసాధారణ రీతిలో హింసాకాండ జరుగుతోందని అందువలన బిజెపి అలాంటి మార్గదర్శకాలను జారీ చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చర్చి కౌన్సిల్ సలహా ఇచ్చింది. రాజకీయ పార్టీలు మతపరమైన అంశాలను తీసుకోరాదని హెచ్చరించింది. నాగాలాండ్ క్రిస్టియన్ రివైవల్ చర్చి కౌన్సిల్((ఎన్‌సిఆర్‌సిసి) విడిగా ఒక ప్రకటన చేస్తూ స్వార్ధ ప్రయోజనాలకు పవిత్ర స్థలాలను రాజకీయం చేయవద్దని కోరింది. మన సమాజంలో మౌలిక విలువలైన సహనం, గౌరవం, మత స్వేచ్ఛలను కాపాడాలని పేర్కొన్నది. నాగాలాండ్‌లో చర్చిలను ఊడ్చే కార్యక్రమం బదులు దేశమంతటా వేధింపులకు గురవుతున్న క్రైస్తవుల రక్షణ గురించి కేంద్రీకరించాలని కౌన్సిల్ అధ్యక్షుడు రెవరెండ్ ఎన్ పాఫినో వ్యాఖ్యానించారు. దేశంలో ఇతర ప్రాంతాల్లో క్రైస్తవుల మీద దాడులు జరుగుతుంటే నాగాలాండ్‌లో చర్చిలను శుభ్రపరచటం ఏమిటని ప్రశ్నించారు. మొత్తం మీద బిజెపి సంతుష్టీకరణ యత్నం వికటించింది. అది బుద్ధి తక్కువ నిర్ణయమని ఆ పార్టీ ఎంఎల్‌ఏ ఇమ్‌కాంగ్ ఇంచెన్ బహిరంగంగానే వర్ణించారు. అలాంటి నిర్ణయం తీసుకొనే ముందు చర్చి అధికారులతో చర్చించి ఉండాల్సిందన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ప్రాంగణాల్లోకి వెళ్లాలనటం అక్రమ ప్రవేశం కిందకు వస్తుందని విమర్శించారు. చర్చిలన్నీ శుభ్రంగా ఉంటాయి, అయినా ఒక రాజకీయ పార్టీ అలాంటి నిర్ణయాలు చేయకూడదన్నారు. తమ ప్రయత్నాన్ని అపార్థం చేసుకున్నారని, అయితే తమ పార్టీ ఇచ్చిన పిలుపులో చర్చిలని కాకుండా ప్రార్థనా స్థలాలను శుభ్రం చేయాలని రాసి ఉండాల్సిందని బిజెపి ప్రతినిధి థామస్ మాహ్ వివరణ ఇచ్చుకున్నారు. ఏ మతాన్ని కించపరచాలని తాము భావించటం లేదన్నారు. ఇంతకూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జారీ చేసిన మార్గదర్శకాలలో కేవలం చర్చి ప్రాంగణాలను ఊడ్చటమేనా లేక స్నానాల గదులు, మరుగుదొడ్లను కూడా శుభ్రపరచాలని ఉందా? చర్చిలను ఊడ్చాలనటం మణిపూర్‌లో చర్చల మీద, క్రైస్తవులుగా ఉన్న గిరిజనుల మీద జరిపిన దాడుల నివారణలో విఫలమైన బిజెపి ప్రభుత్వ పాపపరిహారార్థం తీసుకున్న సంతుష్టీకరణ కార్యక్రమమా?

అధికారం, ఓట్ల కోసం ఇతర పార్టీలు మైనారిటీలను సంతుష్టీకరిస్తున్నాయని నిత్యం పారాయణం చేస్తున్న బిజెపి ఒక వైపు ముస్లింల మీద విద్వేషాన్ని వెళ్లగక్కుతూ మరోవైపు వారి మీద క్రైస్తవులను ఉసిగొల్పుతూ సంతుష్టీకరించేందుకు చూస్తున్నది. ప్రధాని మోడీ స్వయంగా చర్చ్‌కు వెళ్లటమే గాక కేరళలో, ఇతర మరికొన్ని చోట్ల బిజెపి పడుతున్న పాట్లు తెలిసిందే. మొత్తంగా చూసినపుడు దాడులతో బెదిరింపులు ఒక వైపు సంతుష్టీకరణ మరోవైపు కనిపిస్తున్నది. బిజెపి నేత సినీ హీరో సురేష్ గోపి తన కుమార్తె వివాహం శ్రీ కృష్ణ దేవాలయంలో చేయబోయే రెండు రోజుల ముందు త్రిసూర్‌లోని ఒక చర్చికి భార్య, కుమార్తెతో సహా వెళ్లి వర్జిన్ మేరీకి ఐదు సావరిన్ల బంగారు కిరీటాన్ని సమర్పించుకున్నారు. ఇదంతా తరువాత జరిగే లోక్‌సభ ఎన్నికల్లో క్రైస్తవుల ఓట్లకోసమే చేశారనే విమర్శలు వచ్చాయి. తాము తప్ప ఇతర పార్టీలు మైనారిటీల సంతుష్టీకరణకు చూస్తున్నాయని ఆ రోపించే ఆ పార్టీ హిందువుల సంతుష్టీకరణ రాజకీయాలు



చేస్తున్న సంగతి తెలిసిందే. క్రైస్తవులు ఆంగ్లేయులు, వారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని ఆరు సంవత్సరాల క్రితం ముంబై ఉత్తర లోక్‌సభ నియోజకవర్గ బిజెపి ఎంపీ గోపాల్ షెట్టి ఆరోపించారు. 2019 ఎన్నికలకు ముందు అది వివాదాస్పదం కావటంతో తాను రాజీనా మా చేస్తానని సదరు ఎంపీ ముందుకు వచ్చారు. దీని గురించి శివసేన పత్రిక సామ్నా ధ్వజమెత్తింది. ఒడిషాలో ఆస్ట్రేలియన్ మిషనరీ గ్రాహమ్ స్టెయిన్సు చంపినపుడు అక్కడ అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి జెబి పట్నాయక్‌తో కాంగ్రెస్ రాజీనామా చేయించింది. వాటికన్ చర్చి నుంచి వత్తిడి రావటం, సోనియా గాంధీ క్రైస్తవురాలు కావ టం వల్లనే అలా జరిగిందని హిందూత్వ నేతలు విమర్శించారు. ఇప్పు డు ఏమైంది? సోనియాగాంధీ అధికారంలో లేరు, వాటికన్ నుంచి వత్తిడి వచ్చే అవకాశమూ లేదు, గోపాల్ షెట్టిని ఒక నేరస్తుడిగా ఎం దుకు చూస్తున్నారని, ఇదంతా రాజకీయం, 2019 ఎన్నికలకు ముం దు క్రైస్తవులను సంతుష్టీకరించే ప్రయోగమే అని శివసేన పత్రిక ధ్వజమెత్తింది. పాల్ఘర్ లోక్‌సభ ఉపఎన్నిక సందర్భంలో ఓట్ల కోసం ము ఖ్యమంత్రిగా ఉన్న బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవిస్ ముంబై వాసైలోని చర్చిలు, మిషనరీల చుట్టూ ప్రదక్షిణలు చేశారని, క్రైస్తవ సమాజ దేశభక్తిని ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదని శివసేన పేర్కొన్నది.

చర్చిలు, క్రైస్తవులపై పెరుగుతున్న దాడులకు భయపడిన లేదా లొంగిపోయిన కొందరు క్రైస్తవ మతాధికారులు ''ముందు రక్షణకు ప్రాధాన్యత '' అనే పేరుతో బిజెపితో చేతులు కలిపేందుకు పూనుకున్నారు. దానిలో భాగంగానే గతేడాది ఢిల్లీలో క్రిస్మస్ విందు ఏర్పాటు, దానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరు. దానికి అనేక మంది మతాధికారులతో పాటు కేరళలో రుణ, బంగారం వ్యాపారంలో దిట్టలుగా ఉన్న ప్రముఖులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల దాడుల నుంచి తమ విద్యాసంస్థలు, వ్యాపారాల రక్షణకే వారంతా బిజెపికి అనుకూలంగా మారేందుకు సిద్ధపడినట్లు వేరే చెప్పనవసరం లేదు. వివిధ పార్టీలలో ఉన్న వాణిజ్య, పారిశ్రామికవేత్తలను తనవైపు తిప్పుకొనేందుకు ఐటి, సిబిఐ, ఇడిలను ప్రయోగిస్తున్న బిజెపి క్రైస్తవ మతాధిపతులు, వారి ప్రభావంలో ఉన్న సామాన్యుల ఓట్ల కోసం మతాధికారుల మీద కూడా ఆ సంస్థలను ప్రయోగించి దారికి తెచ్చుకుంటున్నది. క్రైస్తవ, ఇస్లామిక్ సంస్థలకు విదేశాల నుంచి నిధులు అందుతున్న సంగతి తెలిసిందే. క్రైస్తవ, ఇస్లామిక్ సంస్థలకు అందే నిధులను ఏదో ఒకసాకుతో నిలిపివేయించి నిర్వాహకులను దారికి తెచ్చుకొనేందుకు చూస్తున్నారు. ఇడి, ఐటి దాడులకు గురైన కేరళలోని బిలీవర్స్ ఈస్టరన్ చర్చి స్థాపకుడు ఇవాంజలిస్ట్ కెపి యోహనన్ కేరళ పత్తానం తిట్ట నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ నేత, మాజీ సిఎం ఏకె ఆంటోని కుమారుడు అనిల్ ఆంటోనికి బహిరంగంగా మద్దతు ప్రకటించారు. వందమంది పాస్టర్లు, ఇతర చర్చి నేతలను తిరువళ్ల పట్టణంలో ఒక చోట సమావేశపరిచి మరీ ఈ పని చేశారు. ఒక చర్చి ఒక రాజకీయ పార్టీకి బహిరంగంగా మద్దతు ప్రకటించటం ఇదే ప్రథమం అని అనిల్ ఒక ప్రకటనలో సంతోషం వెలిబుచ్చారు. కెపి యోహనన్ ప్రమేయం ఉన్న గోస్పెల్ ఫర్ ఆసియా అనే సంస్థ మీద అమెరికాలో నిధుల దుర్వినియోగం కేసు నమోదు కాగా రూ.261 కోట్లు చెల్లించి పరిష్కారం చేసుకున్నట్లుగా వార్తలు వెలువడ్డాయి. ఈ పూర్వరంగంలో సదరు చర్చి బహిరంగంగా బిజెపికి మద్దతు ప్రకటించింది.

దేశంలోని పెద్ద రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా కేరళలో 18శాతం క్రైస్తవులు ఉన్నారు. ఆర్థికంగా కూడా బలమైన తరగతి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో తిరువనంతపురం నియోజకవర్గంలో బిజె పి నేత ఓ రాజగోపాల్ కాంగ్రెస్ అభ్యర్థి శశి థరూర్‌పై పదిహేను వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అక్కడి లాటిన్ చర్చి నేతలే తన ఓటమికి కారణమని రాజగోపాల్ వాపోయారు. దాంతో క్రైస్తవుల ఓట్లు లేకుండా ముందుకు పోలేమని గ్రహించిన బిజెపి 2019లో చర్చిల చుట్టూ తిరిగినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. శబరిమల దేవాలయంలో మహిళల ప్రవేశాన్ని పెద్ద వివాదంగా మార్చినపుడే బిజెపికి కేరళలో హిందువుల మద్దతు లేదని దానికి వచ్చిన 14.88శాతం ఓట్లు వెల్లడించాయి. సరిగ్గా ఎన్నికలకు రెండు రోజుల ముందు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా కేరళలోని చర్చి అధికారులను కలసి మద్దతును కోరారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించటమే అని కాంగ్రెస్ విమర్శించింది. తిరువనంతపురం సమీపంలోని విఝింనం అదానీ రేవు నిర్మాణాన్ని చర్చి తరఫున వ్యతిరేకించినందుకు బిజెపి సర్కార్ తమ బాంకు ఖాతాలను స్థంభింపచేసిందని ఏప్రిల్ 21న తిరువనంతపురం లాటిన్ చర్చి ఆర్చిబిషప్ థామస్ జె నెట్టో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వికె సక్సేనాను కలిసేందుకు నెట్టో తిరస్కరించారు.సిరో మలంకర, బాసిలోస్ మార్తమ్మ మాథ్యూస్, కాథలిక్స్ ఆఫ్ ఈస్ట్, మలంకర చర్చినేతలతో సంప్రదింపులు జరిపారు. ఈ ప్రయత్నాలు బిజెపికి ఎంతమేరకు ఉపయోగపడతాయో చూడాల్సి ఉంది. మొత్తం మీద బిజెపి క్రైస్తవ సంతుష్టీకరణ కొత్త పుంతలు తొక్కుతున్నది.

# దేశ సంస్కృతికి భాండాగారాలు మ్యూజియంలు

నిర్దిష్ట కాల వ్యవధిలో దేశం యొక్క సంస్కృతి వారసత్వం యొక్క అభివృద్ధికి మ్యూజియంలు రుజువులుగా ఉంటాయి. ఇవి ఒక దేశ సంస్కృతికి భాండాగారం లాంటివి.

**మ్యూజియం అంటే :** సమాజ సేవలో పరిశోధిస్తూ సేకరిస్తూ పరిరక్షిస్తూ అర్థం చేసుకుంటూ ప్రత్యక్షమైన కనిపించని వారసత్వాన్ని ప్రదర్శించే లాభాపేక్ష లేని శాశ్వత సంస్థను మ్యూజియం అంటారు.

**అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం:** ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ మ్యూజియం కౌన్సిల్ (ఐకాం ఐసిఒయం) ద్వారా స్థాపించబడింది. ప్రతి సంవత్సరం మే 18న దీనిని జరుపుకుంటారు. సమాజంలో మ్యూజియంల పాత్రను ప్రోత్సహించడానికి ఐకాం 1977లో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది.

**2024 థీమ్:** ఈ సంవత్సరం థీమ్ మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ రీసెర్చ్ విద్య మరియు పరిశోధనల కోసం మ్యూజియంలు. 'అంతర్జాతీయంగా మ్యూజియంలు ఎదుర్కొంటున్న సంబంధి త థీమ్ లేదా సమస్యను ప్రతిబింబించేలా ప్రతి సంవత్సరం మారుతున్న నిర్దిష్ట థీమ్‌ను ఈవెంట్ హైలైట్ చేస్తుంది. ఈ రో జున మ్యూజియం నిపుణులు ప్రజలను కలుసుకోవడానికి, మ్యూజియంలు ఎదుర్కొనే సవాళ్ల గురించి వారిని అప్రమత్తం చేయడానికి, సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు పోషించే పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది.

**ప్రపంచంలోని మ్యూజియంలు:** ప్రపంచవ్యాప్తంగా అంచనా వేసిన మొత్తం మ్యూజియంల సంఖ్య దాదాపు 1,04,000. కాపిటోలిన్ మ్యూజియం ప్రపంచంలోని పురాతన మ్యూజియం. ఇది క్రీ.పూ1471 లో ఇటలీలో స్థాపించబడింది. మ్యూజియంలు శాస్త్రీయ చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ముఖ్యమైన వస్తువులను కలిగి ఉంటాయి. గతాన్ని అధ్యయనం చేయడానికి ముఖ్యమైన మూలాధారాలుగా పనిచేస్తాయి.

**ఇండియాలో :** మన గతాన్ని మనం తెలుసుకునేలా చేయడం ద్వారా మన సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు గణనీయమైన పాత్ర పోషిస్తాయనేది అందరికీ తెలిసిన విషయమే. భారతదేశం ఈ కోణంలో దాదాపు 5000 సంవత్సరాల చరిత్రలో దాదాపుగా విడదీయని సాంస్కృతిక సంప్రదాయాన్ని కలిగి ఉండటం అదృష్టం. 1814లో స్థాపించబడింది. ఇది భారతదేశంలోని పశ్చిమ బెంగాల్‌లో ఉంది. శిలాజాలు, ఆభరణాలు, పురాతన వస్తువులు, కవచం మరియు పెయింటింగ్‌ల సేకరణను కలిగి ఉంది. ఆర్ట్, ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ, జియాలజీ, జువాలజీ, ఎకనామిక్ బోటనీ అనే ఆరు విభాగాలను కలిగి ఉంటుంది. ఏప్రిల్ 20, 2024 నాటికి భారతదేశంలో మొత్తం 14201 మ్యూజియంలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 32, తెలంగాణలో 36 మ్యూజియంలు ఉన్నాయి. భారతదేశంలోని పశ్చిమ బెంగాల్‌లోని సెంట్రల్ కోల్‌కతాలో ఉన్న మ్యూజియం ప్రపంచంలోని తొమ్మిదవ పురాతన మ్యూజియం.

**డి జె మోహన రావు**

# గెలుపు ఎవరిది?

ఎన్నికల సమరంలో తామే విజయదుందభి మోగిస్తామని ప్రధాన రాజకీయ పార్టీలు గట్టి ధీమాతో ఉన్నాయి. కురుక్షేత్ర సమరాన్ని తలపించిన లోకసభ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు సర్వ శక్తులు ఓడ్డాయి. ఓటర్లు తమకు బాసటగా నిలిచారని ఆయా పార్టీ భావిస్తూ తమ విజయం ఇక నల్లెరు మీద నడకే అన్న యోచనలో ఉన్నాయి. నువ్వా.. నేనా అన్నట్టుగా సాగిన సార్వత్రిక పోరులో జయకేతనం ఎగర వేస్తామని ధీమాతో ఉన్నాయి. ఏ పార్టీ ఎన్నీ సీట్లు సాధిస్తుంది... ఏ పార్టీ పరజయం చవి చూడాల్సి వస్తుందో అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 3 కోట్ల 32 లక్షల 16 వేల 348 మంది ఓటర్లు ఉండగా, లోకసభ ఎన్నికల్లో మాత్రం 2 కోట్ల 24 లక్షల 806 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక కోటి 11 లక్షల 91 వేల 542 మంది ఓటర్లు ఓటుకు దూరంగా ఉన్నారు. ఓటింగ్ సరళిని విశ్లేషించుకుంటూ గెలుపు ధీమాతో ఉన్నప్పటికి లోలోపల భయం నీడలు కమ్ముకున్నాయి. 2024 లోకసభ స్థానాల్లో ఓటింగ్ శాతంను పరిశీలిద్దాం. లోకసభ పోరు ముగిసిన నేపధ్యంలో ఆయా పార్టీల నాయకత్వం, అభ్యర్థులు లెక్కలు... కూడికలు తీసివేతలు చేస్తూ ఓట్ల లెక్కలు గడుతూ విజయ తీరాలకు చేరుతామని కాగ్రెస్, బిఆర్‌యస్, బిజెపి ఒక అంచనాకు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి సిపిఐ బాసటగా నిలువగా, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఓంటరిగా ఎన్నికల గోదాలోకి దిగాయి.

తెలంగాణలోని 17 లోక సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో 66.3 శాతం పోలింగ్ నమోదు అయింది. అత్యధికంగా ఖమ్మంలో లోకసభ స్థానంలో 76.09 శాతం ఓటింగ్ నమోదు అయింది. భువనగిరి లోక సభస్థానంలో 76.78 శాతం ఓటింగ్ నమోదు అయి రెండవ స్థానంలో నిలిచింది. మెదక్‌లో 75.09 శాతం ఓటింగ్ నమోదు అయి మూడవ స్థానంలో నిలువగా, చివరి స్థానంలో హైదరాబాద్ నిలిచి 48.48 శాతం ఓటింగ్ నమోదు అయింది. నాగర్‌కర్నూల్, వరంగల్, పెద్దపల్లి (ఎస్సీ) అధిలాబాద్, మహబూబాబాద్ (ఎస్టీ) రిజర్వు స్థానాలు కాగా, మిగత స్థానాలు జనరల్ అభ్యర్థులు తలపడ్డారు. 2019లో జరిగిన లోకసభ ఎన్నికల కంటే ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో 3 శాతం ఓటింగ్ పెరిగింది.

అదిలాబాద్ 74.03, పెద్దపల్లి, 67.87, కరీంనగర్, 72.54, నిజామాబాద్ 71.92, జహీరాబాద్ 74.63, మెదక్ 75.09, మల్కాజిగిరి 50.78, సికింద్రాబాద్ 50.78, హైదరాబాద్ 48.48, చేవెళ్ళ 56.5, మహబూబ్‌నగర్ 72.43, నాగర్‌కర్నూల్ 69.46, నల్గోండ 74.02, భువనగిరి 76.78, మహబూబాబాద్ 71.85, ఖమ్మం 76.09, శాతం ఓటింగ్ నమోదు అయింది. అయితే గడిచిన అసెంబ్లీ ఎన్నికలకు పోల్చి చూస్తే 8.56 శాతం ఓటింగ్ లోక సభ ఎన్నికల్లో తగ్గింది. పోలింగ్ సరళిని అంచనా వేసిన కాంగ్రెస్ పార్టీ 10 నుంచి 14 స్థానాలు, బిఆర్‌యస్ 14 స్థానాలు, బిజెపి 12 స్థానాల్లో విజయం సాధిస్తామని ఆయా పార్టీల నాయకత్వం గట్టి నమ్మకంతో ఉన్నాయి.

ఆయా పార్టీల జాతీయ నాయకత్వం ప్రచారం చేసి ఓటర్లను ప్రసన్నం చేసుకున్నప్పటికి ఏ పార్టీ వైపు మొగ్గు చూపారన్నది వేయి డాలర్ల ప్రశ్న. పరస్పర ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటూ, హామీలు, వాగ్దానాలు కురిపించిన ఆయా పార్టీలకు ఓటర్లు అండగా నిలిచారు. అధికార పార్టీకి బాసటగా నిలిచారా అన్న ప్రశ్నలు ఉదయిస్తూన్నాయి. తాము ఇచ్చిన గ్యారింటీల అమలు చేసినందు వల్లనే విజయం తమదేనని అధికార పక్షం ధీమా తో ఉంది. గతంలో తాము చేసిన అభివృద్ధివల్లనే ఓటర్లు తమకు పట్టం కదుతారన్న ధీమాతో బారస ఉంది. బిజెపి తాము సైతం ప్రధాన పార్టీలకు గట్టి పోటి ఇవ్వడం కాకుఇడా విజయం సాధిస్తామన్న ప్రగాడ విశ్వాసంతో ఉంది. విజయాకాశలపై అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తునప్పటికి జూన్ 4న భవితవ్యం తెలనున్నది.

**గుర్రం మోహన్‌రెడ్డి**

# ఉపాధ్యాయ పదోన్నతులు బదిలీలు జరిగేనా?

లేఖ

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ పదోన్నతులు బదిలీలు జరిగేనా? అనే ప్రశ్న ఉపాధ్యాయుల్లో పెద్ద చర్చనీయాంశమైంది. గురువారం నాడు ఉపాధ్యాయ సంఘాలైన జా క్టో, యుఎస్‌పిఎస్ నాయకులు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు వెళ్లి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని కలవడం శ్రీ రేవంత్ రెడ్డి గారి సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం గారిని కలవడం జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి తో తెలం గాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీల కోసం అనుమతి కోసం రాస్తామని హామీ ఇచ్చారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నాడు అన్ని పత్రికల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులకు బదిలీలకు తొలిగిన అడ్డంకులు, ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలకు పచ్చజెండా, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు త్వరలో, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలకు సర్కారు సిద్ధం ఈ విధంగా అనేక శీర్షికలతో వార్తలు పతాక శీర్షికలతో ప్రచురింపబడ్డాయి. ఎలక్షన్ కోడ్‌తో ముడిపెట్టి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరగాలని చూడటం జరగని పని. ఉపాధ్యాయులలో అనే క సమస్యల్ని గత ప్రభు త్వం సృష్టించింది.


10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చడం జీవో 317 పేరిట జూనియర్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మారు మూల ప్రాంతాలకు కేటాయించి స్థానికులను స్థానికేతరులుగా మార్చింది. స్పౌజ్ కేసులు, గుర్తిం పు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు పాయింట్లు కేటాయించడం, రంగారెడ్డి జిల్లాలో అనేక మంది ఉపాధ్యాయులు జూనియర్‌లు వచ్చి సీనియర్‌లు గా మారడం ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్రంలోని అత్యున్నత న్యాయస్థానం హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొని రావడం ఉపాధ్యాయు ల పదోన్నతులు, బదిలీలు ఆపివేయడం గతంలో జరిగిన అనుభవాలు.

ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు గతంలో జరిగినవే కానీ తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు స్టే వలన ఆగినవి. ఇప్పుడు హైకోర్టు స్టేను వెకెట్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు జరుపుకోవొచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులకు టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనలు జాతీయ విద్యా మండలి (ఎన్‌సీటిఈ), తెలంగాణ హైకోర్టు చెప్పడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు ఇవ్వడానికి టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) పెద్ద అడ్డంకిగా మారినుండె. కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులు ఈ వ్యాస రచయిత డాక్టర్ ఎస్.విజయ భాస్కర్ మరికొంత మంది హైకోర్టు కు వెళ్లి జీవో 36 ప్రకారం 2010 ఆగష్టు కంటే ముందు నియమింపబడిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరడం, హైకోర్టు 2010 కంటే ముందు నియమింపబడిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. సీనియర్ ఉపాధ్యాయులకు హైకోర్టు తీర్పు పెద్ద ఉపశమనం కలిగించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పదోన్నతులు ఇవ్వడానికి టెట్ నుండి మినహాయింపు లభించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు విషయంలో కసరత్తు మొదలు అయినట్లు తెలుస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలోని తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ మిగతా దేశీయ భాషలను బోధించే ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలలలో బోధిస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికి, వెట్టిచాకిరికి గురయ్యారు. పదోన్నతులు అనగానే ఎస్జీటీ ఉపాధ్యాయ మిత్రులు హైకోర్టు కు వెళ్లి స్టే తీసుకొని రావడం భాషోపాధ్యాయులకు పదోన్నతులు రాకుండా స్టే తీసుకొని రావడం జరిగేది. భాషోపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరిన వారు భాషోపాధ్యాయులుగా పదవీ విరమణ చేయాల్సి రావడంతో ఏ ఒక్క పదోన్నతి పొందకుండా పదవీ విరమణ చేయాల్సి వచ్చేది. గత 25,26 సంవత్సరాల నుండి భాషోపాధ్యాయులకు పదోన్నతులు లభించలేదు. తెలంగాణ రాష్ట్రం లోని భాషోపాధ్యాయులకు జీతం స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్‌కు ఎప్పుడో దాటి పోయింది. భాషోపాధ్యాయులకు పదోన్నతులు ఇస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేదు. భాషోపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం వలన హోదా మాత్రమే మారుతుంది. విద్యా సంవత్సరం మధ్యలో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని రిలీవ్ చేయలేదు. గతంలో బదిలీలు తీసుకున్న ఉపాధ్యాయులందరిని రిలీవ్ కోసం ఉపాధ్యాయులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

**డాక్టర్ ఎస్. విజయ భాస్కర్**


# 'హెచ్ఐవి – ఎయిడ్స్' వ్యాధికి వ్యాక్సిన్ ఎన్నటికి?


డా. బుర్ర మధుసూధన్ రెడ్డి

విశ్వసమాజాన్ని వణికిస్తున్న ముఖ్య ప్రాణాంతక వ్యాధుల్లో హెచ్ఐవి – ఎయిడ్స్, ఎబోలా, క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైనవి ముందు వరుసలో ఉన్నాయి. 'హ్యూమన్ ఇమ్యునో వైరస్ (హెచ్ఐవి)' సోకడం ద్వారా వ్యాపించే వ్యాధిని 'అర్జిత వ్యాధి నిరోధశక్తి లోప కారణ బహువ్యాధి లక్షణం (అక్వైర్డ్ ఇమ్యునో డెఫిసియెన్సీ సిండ్రోమ్) లేదా ఎయిడ్స్' అని పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా 39 మిలియన్లు, ఇండియాలో 2.3 మిలియన్ల హెచ్ఐవి – ఎయిడ్స్ సోకిన బాధితులు ఉన్నారని, 2019 లోనే 1.7 మిలియన్ల మందికి సోకిందని గణాంకాలు తెలుపుతున్నాయి. నేటికీ ఎయిడ్స్‌ను శాశ్వతంగా కట్టడి చేయగల ఎలాంటి టీకా మందు అందుబాటులో లేనప్పటికీ వైద్య ఆరోగ్య, శాస్త్రసాంకేతిక సమాజం ఏయిడ్స్ టీకాను రూపొందించే క్రమంలో తీవ్ర పరిశోధనల్లో మునిగి ఉంది. ఎయిడ్స్ వ్యాధి, హెచ్ఐవి నివారణపట్ల సంపూర్ణ అవగాహన, ఎయిడ్స్ రోగులకు చేయూత నిచ్చే సేవామూర్తులను అభినందించడంతో పాటు వ్యాక్సిన్ రూపొందించే శాస్త్రజ్ఞుల ప్రయత్నాల పట్ల ప్రపంచ మానవాళికి అవగాహన కల్పించడం కో సం ప్రతి ఏటా 18 మే రోజున 'ప్రపంచ ఎయిడ్స్ టీకా అవగాహన దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 18 మే 1997 రోజున అమెరికాలోని మోర్గాన్ స్టేట్ యూనివర్సిటీ సమావేశంలో పాల్గొ న్న నాటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధిని రూపుమాపగల వ్యాక్సీన్‌ను రూ పొం దించాల ని శాస్త్రజ్ఞులను విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన సమాజం 18 మే 1998 రోజు నుంచి ప్రతి ఏటా ప్రపంచ ఎయిడ్స్ టీకా అవగాహన దినం జరుపుకోవడం ప్రారంభించారు. అరక్షిత అక్రమ లైంగిక సంబంధాలు, రోగి రక్తం ఆరోగ్యవంతుల రక్తంలో కలవడం, తల్లి నుంచి శిశువుకు హెచ్ఐవి సోకే ప్రమాదం ఉందని మనకు తెలుసు. ఎయిడ్స్‌ను పూర్తి స్థాయిలో నిలువరించగల ఔషధాలు నేటికీ అందుబాటులో లేవు. హెచ్ఐవి – ఎయిడ్స్‌కు ఏకైక ఔషధం టీకామందు మాత్రమే అని ప్రపంచ మానవాళి నమ్ముతున్నది. ప్రపంచ ఎయిడ్స్ టీకా దినం వేదికగా స్వచ్ఛంధ కార్యకర్తలు, సంఘ సేవకులు, ఆరోగ్య సిబ్బంది, టీకా రూపొందించే యజ్ఞంలో అవిశ్రాంత కృషి చేస్తున్న శాస్త్రసాంకేతిక నిపుణులను గుర్తించి, కృతజ్ఞతలను తెలియజేయడం జరుగుతుంది. రాబోయే రోజుల్లో సురక్షిత, ప్రభావశీల హెచ్ఐవి – ఎయిడ్స్ టీకా అందుబాటులోకి వస్తోందని పరిశోధనా ఫలితాలు తెలియజేస్తున్నాయి. హెచ్ఐవి వైరస్ అతి వేగంగా పరివర్తనం చెందే స్వభావం కలిగి ఉన్న కారణంగా టీకా మందు అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఫిబ్రవరి 2021లో న్యూయార్క్ 'ఐఎవిఐ స్క్రిప్స్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ చేస్తున్న పరిశోధనల్లో ఎయిడ్స్ వ్యాక్సిన్ రూపొందించే ప్రయత్నాలలో కొంత పురోగతి సాధించడం సంతోషించదగిన పరిణామం. కరోనా వైరస్‌కు టీకా రూపొందించిన మోడెర్నా ఫైజర్ కంపెనీలు వ్యాక్సీన్ కోసం ఎంచుకున్న యంఆర్‌యన్ఏ ప్రక్రియను అనుసరించి హెచ్చఐవి–ఎయిడ్స్ టీకాను రూపొందించే పరిశోధనలు సత్ఫలితాలను ఇస్తున్నాయని తెలుస్తున్నది. ఈ పద్ధతిలో హెచ్ఐవి టీకా రూపొందితే, ఇదే పద్ధతిలో డెంగ్యూ, ఇన్ఫ్లుయెంజా, జికా, హెపటైటిస్ సి, మలేరియా లాంటి వ్యాధుల కట్టడికి కూడా టీకాలను రూపొందించడానికి మార్గం సుగమం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఐవి – ఎయిడ్స్ మ్యుటేటింగ్ టీకాలతో యాంటీబాడీలను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన రోగనిరోధక కణాల తయారీని ఉత్తేజ పరిచడంలో 'జర్మ్‌లైన్ టార్గెటింగ్' ప్రక్రియలో సఫలీకృతం కావడం విశేషం. ఈ పరిశోధనల్లో తొలి దశ క్లినికల్ ట్రయల్స్1లో 48 మంది పాల్గొనగా, అందులో 47 మందికి ఆశించిన ఫలితాలు కనిపించాయని, ఇదే క్రమంలో ఫేజ్ ఫైనల్ ట్రయల్స్ సత్ఫలితాలను ఇచ్చిన యెడల హెచ్ఐవి – ఎయిడ్స్ టీకా రావడానికి మరెంతో సమయం పట్టదని తెలుస్తున్నది. హెచ్ఐవి – ఎయిడ్స్ టీకా మందు తయారీ మహాయజ్ఞంలో శాస్త్రజ్ఞులు విజయవంతం కావాలని, ఎయిడ్స్ రహిత ప్రపంచ సమాజాన్ని నిర్మించాలనే సంకల్పం కలిగిన 'ఐఏవిఐస్క్రిప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్'కు ముందస్తు శు భాకాంక్షలు తెలుపుదాం. హెచ్ఐవి – ఎయిడ్స్ గూర్చి తెలుసుకుందాం, వైరస్ వ్యాప్తిని అరికడదాం.

## అందరి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

ఎమ్మెల్యే కుంభం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాత రాసి శ్రీకాంత్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నందున ముందస్తు చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్ఓసి మంజూరు చేసి శుక్రవారం బాధితుడికి ఆయన నివాసంలో అందజేశారు. పోచంపల్లి టౌన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు మేకల రామకృష్ణ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు నారి మహేష్, జిల్లా నాయకులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మేకల సంజీవ రెడ్డి,సీనియర్ నాయకులు చిలుకల సంతోష్ యాదవ్, సరసాని వెంకట్ రెడ్డి, కోడిమాల ప్రశాంత్ రెడ్డిలు బాధితుడి వెంట ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ బిఎం సంతోష్

**ప్రజాపక్షం / గద్వాల :** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ పేర్కొన్నారు.శుక్రవారం గద్వాల మండలంలోని బీరెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధనపు కలెక్టర్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలను పండించి తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం సేకరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఏవైన ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు.అనంతరం వారు ధాన్యం గిడ్డంగుల రవాణా రైతుల సాగు ధృవీకరణ పత్రాలు,కొనుగోలు చెల్లింపులు,గన్ని సంచులు,రిజిస్టర్లు, పరిశీలించి ఇప్పటి వరకు ఎన్ని క్వింటాల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని అధికారులను అడిగితెలుసుకున్నారు.అనంతరం లత్తిపరం గ్రామంలో అధనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారుఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ నర్సింగరావు,పౌర సరఫరాల శాఖ అధికారి ఎం. విమల, గద్వాల ఎంపిడిఓ ఉమాదేవి,తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టణ యువజన అధ్యక్షుడు సీత సుధాకర్ కోరారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి పట్టణ యువజన కాంగ్రెస్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరిగే నల్గొండ,ఖమ్మం,వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియంత పాలనను గద్దె దించేవరకు జైళ్లకు అక్రమ కేసులకు భయపడకుండా ప్రజల పక్షాన వుండి పోరాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని పేర్కొన్నారు. నిరుద్యోగుల పట్ల ప్రశ్నించే గొంతుకగా చట్ట సభకు పంపాల్సిన బాధ్యత పట్టభద్రులదని అన్నారు. నేటి నుండి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతి ఓటర్ దగ్గరకు వెళ్ళి మల్లన్న గెలుపు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జినుకల జయసూర్య, పెంట నవీన్ గోలి నందు కస్తూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పురుగుల మందులు వాడాలి



**ప్రజాపక్షం / అయిజ :** నాణ్యమైన పురుగుల మందులను రైతుల వినియోగించడం వల్ల రైతులకు ఎంతో లబ్ది చేకూరుతుందని జయలక్ష్మి ఫర్టిలైజర్స్ రీజనల్ మేనేజర్ సాయి ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అయిజ సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండెడ్ పురుగు మందులతో పాటు నకిలీ పెస్టిసైడ్స్ మార్కెట్లో ఉండటం వల్ల వాటిని గుర్తించలేక రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు.పెద్ద పెద్ద పెస్టిసైడ్స్ ఉత్పత్తి చేసే కంపెనీలకు రా మెటీరియల్‌ను మా సంస్థనే ముందుగా అందించిందని ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో ప్రవేసించి బ్రాండెడ్ కంపెనీలకు దీటుగా క్రిమిసంహారక మందులను ఇతర ఫర్టిలైజర్లను రైతుల దగ్గరకు తీసుకొస్తుందని తెలిపారు. ముఖ్యంగా సింగిల్ విండో సంస్థ నాణ్యమైన ఫర్టిలైజర్స్‌ను అందిస్తూ కొంత లాభం మాత్రమే తీసుకొని ఎక్కువ రైతులు లబ్ది పొందే విధంగా పిఎసిఎస్ అయిజ వ్యాపారం చేయడం మాకు ఎంతగానే నచ్చి ఆకర్శించింది కనుక మా యొక్క డీలర్ షిప్ తీసుకొని ఇటు రైతులకు అటు మా సంస్థకు మేలు చేయాలని సింగిల్ విండో అధ్యక్షులు పోతుల మధుసూధన్ రెడ్డిని కోరారు.

## రాజకీయాలకు అతీతంగా అధికారులు పనిచేయాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** అధికారులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ,బిజెపి పార్లమెంట్ ఎంపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల నుండి ఆరాచాక పాలన సాగిస్తున్నదన్నారు.నియోజకవర్గాన్ని అవినీతికి అడ్డాగా మార్చారన్నారు.ఇక నుండి అవినీతిని అడ్డుకుంటామన్నారు.భయపెట్టి పాలన సాగించలేరన్నారు. గతంలో ఒక్క రాజకీయ కేసు కూడా ప్రతిపక్షాలపై పెట్టలేదని సామరస్యంతో ఉన్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని,అది తట్టులేక కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని ఆయన అన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు బాల వెంకటేశ్వర్లు,చింతకుంట్ల సోమిరెడ్డి,ఆకుల జగతయ్య గౌడ్, నందిపాటి హిందూజ, పిన్నపురెడ్డి మల్లారెడ్డి, పార్థనబోయిన విజయ్, విజయ్‌రెడ్డి, చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, పల్లెపంగ వీరబాబు,ఉప్పెల్లి ప్రవీణ్‌కుమార్,మండల కోఆర్డినేటర్లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అత్యధిక శాతం సిజేరియన్లు యాదాద్రిలోనే..

సిజేరియన్ కాన్పులు మానుకోవాలి

ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన వైద్యాధికారులు

ఆసుపత్రుల నిర్వాహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు



**ప్రజాపక్షం / చౌటుప్పల్ :** పుట్టబోయే పిల్లలను మూహూర్తాల పేరుతో,డబ్బుల కోసం వైద్యులు కక్కుర్తి పడి సిజేరియన్ కాన్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటి డియంఎచ్ఓ డాక్టర్ యశోద,డాక్టర్ శిల్పిని అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శుక్రవారం వాసవి హస్పిటిల్, ప్రశాంతి హస్పిటల్, మాధవరెడ్డి హస్పిటల్, శ్వేత ప్రియాంక హాస్పిటల్ లలో జిల్లా వైద్యాధికారుల బృందం ఆకస్మిక తనిఖి చేశారు.పలు హాస్పిటల్స్‌లలో కేసు షీట్స్‌ను పరిశీలించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.రాష్ట్రంలో సిజేరియన్స్76 శాతంగా ఉంది. యాదాద్రి జిల్లాలో 84 శాతంగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. చౌటుప్పల్ లోని ప్రభుత్వ,ప్రైవేట్ ఆసుపత్రులలో నార్మల్ డెలివరీలు తక్కువ చేస్తూ సిజేరియన్స్ ఎక్కువగా చేస్తున్నట్లు తనిఖిల్లో వెల్లడైందని పేర్కోన్నారు. మొదటి కాన్పు కోసం ఆసుపత్రికి వస్తే సహజ కాన్పు చేయకుండా సిజేరిన్ చేయడం వల్ల రెండో కాన్పుపై ప్రభావం పడుతుందని చెప్పారు. మహిళల ఆరోగ్యాలపై విపరీతమైన ప్రభావం చూపుతుందని అన్నారు.

**మొదట షోకాజ్ నోటీస్‌లు...సరిచేసుకోకుంటే ఆసుపత్రులు సీజ్....**

నార్మల్ డెలివరీలు చేయకుండా డబ్బులకు కక్కుర్తి పడి సిజేరియన్ చేసి కాన్పులు చేసే ఆసుపత్రులపై కఠిన చర్యలు తప్పవని వైద్యాధికారులు డాక్టర్ యశోద,డాక్టర్ శిల్పిని హెచ్చరించారు. యాదాద్రి జిల్లాలో 57 ప్రైవేట్ ఆసుపత్రులు కాన్పులు చేస్తున్నాయని తెలిపారు. వారం రోజులుగా చేస్తున్న తనిఖీల్లో ఇప్పటి వరకు 7ఆసుపత్రులకు షోకాజ్ నోటిస్‌లు ఇచ్చినట్లు చెప్పారు. నోటిస్‌లు అందుకున్న ఆసుపత్రులు మూడు రోజుల్లో సంజాయిషి ఇవ్వాలని అన్నారు. మొదట ఇచ్చిన నోటిస్‌లతో మార్పు రాకపోతే రెండోసారి సీజ్ చెస్తామని అన్నారు. ప్రతి ఆసుపత్రిలో కాన్పుల రిజిస్టర్ ఉపయోగించాలని పేర్కోన్నారు. చౌటుప్పల్‌లోని పలు ఆసుపత్రుల్లో కనీస రిజిస్టర్లు వాడడం లేదని అన్నారు. ఆసుపత్రుల్లో అర్హత కలిగిన సిబ్బందిని,డాక్టర్లను నియమించడం లేదని చెప్పారు. పలు ఆసుపత్రుల్లో ఫీజుల లిస్ట్,డ్యూటీ డాక్టర్ల బోర్డులు కూడ లేనట్లు పేర్కోన్నారు. ప్రతి ఆసుపత్రిలో కౌన్సిలింగ్ రిజిస్టర్ ఉండాలని సూచించారు.ఆసుపత్రుల్లో ఉన్న ల్యాబ్‌లలో టెక్నీషియన్‌లు లేరని,రేడియాలజిస్ట్ కూడ లేనట్లు వెల్లడైందని అన్నారు.

**నార్మల్ డెలివరిల కంటే సిజేరియన్స్ ఎక్కువ**

చౌటుప్పల్‌లోని ప్రభుత్వ,ప్రైవేట్ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీల సంఖ్య తక్కువగా ఉంది. ప్రతి ఆసుపత్రిలో 50 శాతం కన్న తక్కువ సిజేరియన్ డెలివరీలు ఉండాలి. కాని చౌటుప్పల్‌లో అందుకు భిన్నంగా ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. గత నెలలో ప్రశాంతి ఆసుపత్రిలో 30 డెలివరీలు కాగా అందులో 20 సిజేరియన్ కాన్పులు, వాసవి ఆసుపత్రిలో 21 కాన్పులు కాగా అందులో 15 సిజేరియన్ కాన్పులు, శ్వేతప్రియాంక ఆసుపత్రిలో 10 కాన్పులు కాగా అందులో 2 సిజేరియన్ కాన్పులు, సిద్దార్థ నర్సింగ్ హోమ్‌లో 10 కాన్పులు కాగా అందులో 8 సిజేరియన్ కాన్పులు, మాధవరెడ్డి ఆసుపత్రిలో 6 కాన్పులు కాగా అందులో 6 సిజేరియన్ కాన్పులు జరిగాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగాం ఆఫిసర్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుమన్‌కళ్యాణ్, డెమో మధుసూధన్‌రెడ్డి, మండల వైద్యాధికారి చింత కింది కాంటంరాజు,సిబ్బంది పాల్గోన్నారు.

## జూన్ 5 నాటికి 'అమ్మ ఆదర్శ పనులు' పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ వెంకట్రావ్



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ :** అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేసి జూన్ 5 నాటికల్లా పూర్తిచేసి పిల్లలకు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల పనులను కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని తెలిపారు.పాఠశాలలో జరుగుతున్న పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. పనులను నాణ్యమైన మెటిరియల్ కొనుగోలు చేసి పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ముఖ్యంగా త్రాగునీరు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, విద్యుత్, పాఠశాల గదిలోని బ్లాక్ బోర్డు పనులను త్వరగా పూర్తిచేసి అందచేయాలన్నారు. పాపారిశుద్ధ్య పనులు గ్రామపంచాయతీ సిబ్బంది చూడాలని వారిదే బాధ్యతని కలెక్టర్ పేర్కొన్నారు. రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల అపరిశుభ్రంగా ఉండటం గమనించిన కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి అనితపై అసహనం వ్యక్తం చేశారు. ప్రహరీ ఒకచోట కూలిపోవడం గమనించిన కలెక్టర్ వెంటనే పనులు పూర్తి చేయాలని కలెక్టర్ టిడబ్ల్యూఐడిసి ఏఈ రమేష్‌ను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు టిఎస్‌ఈడబ్ల్యూ ఐడిసిశాఖ ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు 533 పాఠశాలలు గుర్తించగా 506 పాఠశాలల్లో గ్రౌండ్ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 165 పనులు పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఏఈ రమేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అనిత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత బాలిక ఆత్మహత్యకు కారణమైన యశ్వంత్ పైన కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** దళిత మైనర్ బాలికను కొట్టి హింసించి అవమానపరిచి ఆత్మహత్యకు కారణమైన యశ్వంత్ పైన కఠిన చర్యలు తీసుకోవాలి ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. మిర్యాలగూడ మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన దేశబోయిన యశ్వంత్ అతను క్లాస్మేట్ గా ఉన్న దళిత మైనర్ బాలిక ను ఉట్లపల్లి గ్రామానికి వచ్చి అమ్మాయి ఇంట్లో అక్రమంగా జొరబడి కొట్టి, హింసించి, అవమానపరిచి, అమ్మాయి సెల్ గుంజుకుని వెళ్లిగా అవమానం భరించలేక ఊరి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నదని సంఘటనకు కారణమైన యశ్వంత్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మాయి మృతికి కారణమైన అతని పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్యా నేరం నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులు ఇంకా ఎవరైనా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు మృతి

**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడు గ్రామ శివారులో జాతీయ రహదారి 65పై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు మృతి చెందగా మరో యువకుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలోని శ్రీని ఫార్మ పరిశ్రమలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సురేంద్రకుమార్(23), ప్రమోద్(20), పంకజ్‌లు ఉషా లేబర్ కాంట్రాక్టర్ ద్వారా పని చేస్తున్నారు. నేటి ఉదయం సురకంటి గూడెం క్రాస్ రోడ్డు దగ్గర ఏపి 39డబ్ల్యూ 6165 నెంబర్ గల డిసిఎం ఎలాంటి హెచ్చరికలు లేకుండా నిలుపుదల చేస్తున్న క్రమంలో వెనుక పై ద్విచక్ర వాహనంపై వెలిమినేడు నుండి వారు పని చేసే శ్రీని పరిశ్రమకు బయలుదేరిన ఈ ముగ్గురు యువకులు వేగంగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో సురేంద్రకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రమోద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారు. పంకజ్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అసంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటచలం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఉప్పు వాడకం అధికం కావడం వలన అధిక రక్తపోటు,గుండె జబ్బులు,గుండెపోటు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కోటచలం అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైద్య,ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్య సిబ్బందికి బీపీ పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటును తరచుగా పరిరక్షించుకోవాలని, అధిక రక్తపోటు ఉన్నవారు ప్రతిరోజులు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. రోజుకు ఒక టీస్పూన్ కంటే ఎక్కువ ఉప్పు తింటే రక్తపోటు పెరుగుతుందని తెలియజేశారు. ఉప్పు వాడకాన్ని తగ్గిస్తే ఏటా లక్షల మంది ప్రాణాలు కోల్పోకుండా కాపాడవచ్చని తెలిపారు. 5 గ్రాముల పరిమితి కంటే ఉప్పు తీసుకుంటే అధిక ముప్పు ఉంటుందని, ఎక్కువ ఉప్పు కలిగిన ఆహార పదార్థాలు తినడం వలన అన్నాశయ క్యాన్సర్, ఊబకాయం, ఆస్టియో పోరోసిస్, మెనియర్స్, మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. అధిక ఉప్పు వాడకం వలన బీపీ పెరిగి మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు.తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారం తినడం ద్వారా ఉప్పు వాడకాన్ని తగ్గించవచ్చని సూచించారు. జిల్లా అసంక్రమితవ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జీవన శైలిలో వ్యాధుల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రోగ్రాం అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజు కనీసం అరగంట వ్యాయామం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ జయ శ్యాంసుందర్, సాంబశివరావు, అంజయ్య, శ్రీనివాస్, యమున, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాత జాతీయ రహదారి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** పట్టణంలోని ఎస్వీ కళాశాల నుండి పిఎస్ఆర్ సెంటర్ వరకు జరిగిన రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ ( లోకల్ బాడీస్) చొక్క ప్రియాంక శుక్రవారం పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇ.ఇ.జి.కె.డి ప్రసాద్, డి.ఈ సత్యారావు, ఏఈలు సుమంత్,వరుణ్,ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

## సోషల్ మీడియా వారియర్స్‌తో ముఖ్యమంత్రి భేటీ



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** సోషల్ మీడియా వారియర్స్ తోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని దస్పల్ల హోటల్లో తెలంగాణ రాష్ట్రములోని అన్ని జిల్లాల సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా నార్కట్ పల్లి మండలం నుండి టీపీసీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పులిజాల రవికుమార్ హాజరైనారు. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ ముందు వరుసలో వుండీ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రతి ఒక్క సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ కృషి చేయాలని పిలుపునిచ్చారని రవి తెలిపారు. ఇక ముమ్ముందు సోషల్ మీడియా పాత్ర కు బాధ్యత పెరగున్నట్లు చెప్పుకొచ్చారు. అనంతరం కో ఆర్డినేటర్స్ తో ఫోటో సెషన్ ఏర్పాటు చేశారు.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కొరివి శివరాం**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అత్యంత కీలకమైన పాత్ర పోషించిన సోషల్ మీడియా వారియర్స్ తో హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జిల్లా నకిరేకల్ నియోజకవర్గం నార్కెట్పల్లి మండలానికి చెందిన నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొరివి శివరాం మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.

## ఎంజియు డిగ్రీ పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ సెమిస్టర్ల డిగ్రీ పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఆరవ సెమిస్టర్ పరీక్ష కు మొత్తం 8954 మంది కి గాను 8314 మంది హాజరైనట్లు, మొదటి సెమిస్టర్ లో 935 మందికి గాను 832 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అన్ని పరీక్షా కేంద్రాల్లో తగు ఏర్పాటుకు కళాశాలల సూపరండెండెంట్ లకు సూచనలు జారీ చేశామని, పరీక్షలు సైతం అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు, ఫలితాలు సైతం త్వరితగతిన విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పరీక్ష కేంద్రాలైన హుజూర్ నగర్,కోదాడ,సూర్యాపేట కేంద్రాలను డాక్టర్ లక్ష్మీప్రభ, డి సంధ్యారాణి సందర్శించడం జరిగిందని తెలిపారు.

## అనుమానస్పద స్థితిలో విద్యార్థిని మృతి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి సింధూజ(17) అనే నర్సింగ్ విద్యార్థిని శుక్రవారం అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఊట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి సింధూజ నల్లగొండలో నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్ద ఉంటుంది. తక్కెళ్ల పాడు గ్రామానికి చెందిన దేశబోయిన యశ్వంత్‌తో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటుంది. మూడు రోజులుగా ఇద్దరి మధ్య ఫోన్‌లో గొడవ జరగడంతో సింధూజ యశ్వంత్ ఫోన్ నెంబర్ బ్లాక్ చేసింది. దీంతో యశ్వంత్ శుక్రవారం ఊట్లపల్లి గ్రామానికి వచ్చి సింధూజను కలిసి ఆమెను నిలదీసినట్లు సమాచారం. కొంతసేపటి తరువాత సింధూజ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించేప్పటికి సింధూజ మృతి చెందింది. సింధూజ తండ్రి చంద్రశేఖర్ గతంలో మృతిచెందగా తల్లి వెంకటమ్మతో కలిసి ఉంటుంది. వెంకటమ్మ శుక్రవారం ఉదయం ఉపాది కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఘటన చోటు చేసుకుంది. విద్యార్థిని మృతదేహాన్ని డీఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను పూర్తి చేయాలి

కలెక్టర్ హనుమంతు జెండగే



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** అమ్మ ఆదర్శ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్,ఎంఈవో, ఏపీఎంలు, మెప్మా అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో త్రాగు నీటి పనులను ఆయన సమీక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు, మేజర్ మైనర్ మరమ్మత్తులకు చేపట్టవలసిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, చేపట్టిన తర్వాత ఫోటోలను తీయాలని తెలిపారు. పురోగతిలో వున్న పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని, పనులకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనుల రిపోర్టులు సమర్పించి నిధులు పొందాలని, పనులలో వెనుకబడిన మండలాలు సకాలంలో లక్ష్యాలు సాధించేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఎంపిడిఓలు, ఎంఇఓలు, ఎపిఎం లు, పంచాయితీరాజ్, ఆర్.అండ్.బి, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో గ్రామ స్థాయి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల తోడ్పాటుతో పనులు పూర్తి చేయాలని, పాఠశాలల్లో అన్ని వసతులతో రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు స్వాగతం పలుకాలని సూచించారు. విద్యార్థినీ విద్యార్థులకు డ్రెస్సుల కుట్టు పనులు స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని, ఏ సంఘంలోనైనా కెపాసిటీకి తగిన పనులు చేయలేకపోతే ఇతర సంఘాలకు అప్పగించాలని, సకాలంలో డ్రెస్సులు కుట్టేలా క్షేత్రస్థాయిలో ఎపిఎంలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.ఏ.కృష్ణన్, జిల్లా విద్యాశాఖాధికారి కే. నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ఎన్. శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి సునంద పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/బోథ్ :** అకాల వర్షాల కారణంగా తడిసిన జొన్న పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోథ్ మార్కెట్ యార్డును సందర్శించి తడిసిన జొన్నలను పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొంటారని అన్నారు. ఇదిలావుండగా హమాలీల సమస్యలపై సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు.ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## కల్లాల్లో వడ్లు కొనండి..

రైతుల ఆవేదన



**ప్రజాపక్షం/చందుర్తి :** కల్లాల్లో పేరుకుపోయిన వరి ధాన్యం కొనుగోలు చేయాలంటూ చందుర్తి మండలం లింగంపేట అనుబంధ గ్రామమైన కొత్తపేట రైతులు ఆవేదన చెందుతున్నారు. కోతలు కోసినప్పటి నుండి నేటి వరకు కేవలం రెండు లారీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని దాదాపు కోటి యాభై లక్షల విలువ గల ధాన్యం కల్లాల్లో పేరుగుపోయి ఉందని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని చందుర్తి సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి విజ్ఞప్తి చేశారు.

## ఒకరి దారుణ హత్య



**ప్రజాపక్షం/బుగ్గారం :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపాలపూర్ గ్రామంలో గురువారం రాత్రి దారుణం జరిగింది. గోపాలపూర్‌కు చెందిన దీటి శ్రీనివాస్(36) అనే వ్యక్తిని తలపై కర్రలతో దాడి చేసి హతమర్చారు. ఈ దాడి ఘటనలో మహేష్ అనే వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాత గొడవల నేపథ్యంలో జరిగిన ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు బుగ్గారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కూడా శుక్రవారం ఉదయం ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికంగా వివరాలు సేకరించారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అట్టహాసంగా లయన్స్ 'మల్లికాన్' ప్రారంభం




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ, కర్ణాటకలోని కొంత ప్రాంతంతో కూడుకున్న లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ జిల్లా 320 వార్షిక సమావేశం 'మల్లికాన్' కరీంనగర్‌లోని ప్రతిమ మల్టిప్లెక్స్ హోటల్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబు రావు, గ్యాట్ ఏరియా లీడర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్టిపుల్‌లోని వివిధ జిల్లాలలో జరిగిన సేవా కార్యక్రమాల సింహావలోకనం జరిగింది. జిల్లాలలోని వివిధ కంటి ఆసుపత్రుల ద్వారా అందించిన కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమాలు మరింతగా జనభాహుళ్యంలోకి చేరాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో 202425 సంవత్సరానికి గాను కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా హన్మాండ్ల రాజిరెడ్డి, వైస్ చైర్మన్‌గా కె.హరీష్ రెడ్డి, సెక్రటరీగా ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా రేసు మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీగా శివప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ మల్లికాన్ మూడు రోజులు జరుగుతుందని తెలిపారు. 19న అమరులైన లయన్స్ మెంబర్స్‌కు సంతాపం ప్రకటించే కార్యక్రమంతో పాటు వివిధ జిల్లాల డిజి టీమ్స్‌ల పరిచయం ఉంటుందని చెప్పారు. సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కాన్ఫరెన్స్ సెక్రటరీ అనంతుల శివప్రసాద్ పిలుపునిచ్చారు.

## మే 24 నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుండి జూన్ 3 వరకు జరుగుతాయని, వీటి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో మొత్తం 16 సెంటర్లలో ఉదయం, సాయంత్రం పరీక్షలు జరుగుతాయని, ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 3196 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 2314 మొత్తం 5510 మంది విద్యార్థులు హాజరవుతారని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించుటకు జిల్లా పరీక్షల కమిటీ ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించడం జరిగిందన్నారు. ప్రతి సెంటర్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. సిసి కెమెరా నిఘాలో పరీక్ష ప్రశ్నాపత్రాలు తెరువాలని, షెడ్యూల్ ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి , జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్, డీఈ టిఎస్ఎన్పిడిసిఎల్ రవి, సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

**ప్రజాపక్షం/ వాంకిడి :** అకాల వర్షాల దృష్ట్యా ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని వాంకిడి ఎస్ఐ డి. సాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉరుములు, పిడుగులతో కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం పడుతున్న సమయంలో ఎవరు కూడా చెట్ల కిందకు వెళ్లవద్దని, చెట్ల మీద పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో పంట పొలాల్లో, చేన్లలో విద్యుత్ తీగల వద్ద ఉండరాదని, పిడుగులు పడుతున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# పారదర్శకంగా విత్తనాల విక్రయం చేపట్టాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో పారదర్శకంగా విత్తనాల విక్రయం ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత విత్తన, ఎరువుల డీలర్లకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే వానాకాలం విత్తన విక్రయ ప్రక్రియ, నకిలీ విత్తనాల నిర్మూలన తదితర అంశాలపై జిల్లాలోని విత్తన డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాల లేబుల్స్, కలర్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు అమ్మాలని, గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే నేరమని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సబ్సిడీ ఉన్న విత్తనాలు అర్హులైన వారికి మాత్రమే విక్రయించాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాల స్టోరేజ్ వద్ద నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, విత్తనాల స్టోరేజి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పాస్ యంత్రాల ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు విత్తనాలను అమ్మాలని, క్షేత్రస్థాయిలో అంతర్జాలం సమస్యలను పరిష్కరించి తప్పనిసరిగా ఈ పాస్ యంత్రాలు వినియోగించాలని డీలర్లకు కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి ఎసిపి మాట్లాడుతూ, నాణ్యమైన పంటలను పండించడానికి డీలర్ల పాత్ర ఎంతో ముఖ్యమని, చట్టాలకు భయపడే కాదు రైతుల విషయంలో తప్పు చేస్తే మనస్సాక్షి కూడా హెచ్చరిస్తుందని అన్నారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో పాటు మండల స్థాయిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, మండల వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయనున్నట్టు తెలియచేసారు. ఈ సమావేశంలో ఏసిపి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డి.ఆదిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల,డీలర్ లు, వ్యవసాయ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్యా సాధనకు కృషి చేయాలి**

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి పట్టణంలోని అమర్ నగర్ లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ను పరిశీలించి, వేసవి సెలవుల్లో ఆట, పాటలతోపాటు చదువు నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నామని వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమ్మర్ క్యాంపులోని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు మనం అనుసరించాల్సిన వ్యూహాలను తెలుసుకోవాలని, దానికి అనుగుణంగా మనల్ని మనం సన్నద్ధం చేసుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సమ్మర్ క్యాంప్ వాలంటీర్ మితేష్ సింగ్, సమ్మర్ క్యాంప్ పిల్లలు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## అధిక రక్తపోటు నివారణకు కృషి

డిఎంహెచ్ఓ సుజాత



**ప్రజాపక్షం/ కరీంనగర్ ప్రతినిధి :** అధిక రక్తపోటు నివారణకు కృషి చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుజాత పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సంధర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ వారు వెబ్నార్ నిర్వహించారు. ఈ సంధర్భంగా డాక్టర్ సుజాత, జిల్లా వైద్య బృందం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు. జిల్లాలో అధిక రక్తపోటు గల కారణాలు, అధిక రక్తపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఒక నెలపాటు నిర్వహించాలని సూచించారు. అధిక రక్తపోటు సాధారణంగా 30 పైబడిన వారికి అనారోగ్య అలవాట్లు కారణంగా రావచ్చని తెలిపారు. మంచి ఆహారం, ఆకుకూరలు, గుడ్లు, ఉదయం యోగా వంటి దినచర్యలో భాగంగా చేసుకోవాలని అన్నారు. తద్వారా అధిక రక్తపోటును నివారించవచ్చని డీఎంహెచ్‌వో తెలిపారు.

# అకాల వర్షాలతో అన్నదాత విలవిల

**ప్రజాపక్షం/ తాండూర్/ బెల్లంపల్లి :** తాండూర్ మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షం కారణంగా ప్రాథమిక సహకార సొసైటీ సెంటర్లలో రైతులు అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కుప్పలలో, ఆరబోసిన వడ్ల పక్కన వర్షపు నీరు నిలిచింది. చేతికి వచ్చిన పంట తడిసి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ధాన్యం తడిసి ముద్దయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకువస్తున్న రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

**అకాల వర్షాలు.. కౌలు రైతులకు తీరని నష్టాలు**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కొసార గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు భవానీ నగర్‌కు చెందిన కౌలు రైతు శ్రీకాంత్ వేసిన పల్లి పంట తీవ్రంగా దెబ్బతింది. శ్రీకాంత్ అనే రైతు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పల్లి పంట వేశాడు. పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన అకాల వర్షంతో పంట దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇచ్చి తనను ఆదుకోవాలని కోరారు.



## త్వరితగతిన ధాన్యం తరలించాలి

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. రుద్రంగి మండలంలోని మానాల, సమీపంలోని తండాల వద్ద ఉన్న కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శుక్రవారం తడిసిన ధాన్యాన్ని, రిజిస్టర్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని జాగ్రత్తగా తడవకుండా టార్పలిన్ కప్పాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే రుద్రంగి మండల కేంద్రంలోని రైస్ మిల్లు, వేములవాడ మండలం మర్రిపల్లి మిల్లులో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్లు, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజున అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. రైతులు పండించిన వరి ధాన్యంను త్వరగా తూకం వేసి మిల్లులకు పంపించాలని అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కేంద్రాలకు వచ్చిన వరి పంటను తొందరగా కాంటా వేసి మిల్లులకు తరలించాలని, నిన్న వచ్చిన అకాల వర్షాల వలన పంట నష్టం గురించి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజులలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు పూర్తి చేయాలనీ ఆయా కేంద్రాల నుండి ధాన్యం తరలించాలని అన్నారు. ఎప్పటికప్పుడు ట్యాబ్ రికార్డులలో ఎంట్రీ నమోదు చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో వర్ష సూచన ఉన్నదున రైతులకు టర్పాలిన్ ఇవ్వాలని పంట నష్టం జరగకుండ చూడాలని సూచించారు. ఆయన వెంట డిటిసిఎస్ వర ప్రసాద్, ఉమాపతి ఎఫ్ఐ శ్రీనివాస్, పలువురు అధికారులు ఉన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

**ప్రజాపక్షం/సోన్ :** మండల పరిధిలో పేకాట ఆడుతున్నట్ల సమాచారం అందుకున్న పోలీస్‌లు శుక్రవారం దాడులు నిర్వహించగా న్యూవెల్మల్ గ్రామ శివారులో 11 మంది నుండి 43,500 రూపాయలు, బొప్పారం శివారులో ఏడుగురు నుండి రూ. 12,000 మొత్తం 18 మంది వద్ద 5 5,500 పట్టుబాడ్డాయని ఎస్సై తెలిపారు.

# సకాలంలో ఏకరూప దుస్తులను అందించాలి

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమవుతుండటంతో ఆ లోపుగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు సకాలంలో అందించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరు వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల కొరకు పంపిణీ చేయబడిన బట్టను మండలాల వారీగా పంపిణీ చేసేందుకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి కలెక్టర్ సందర్శించారు. జూన్ 10 లోగా విద్యార్థులకు ఏక రూప దుస్తులు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో ఈ పని సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. 25,322 మంది బాలికలకు, 22,926 మంది బాలురకు ఏక రూప దుస్తులు అందించనున్నట్లు వివరించారు.స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో విద్యార్థులకు జూన్ 10వ తేదీలోగా దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో అన్నారు. అనంతరం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్లను భద్రపరిచిన గోదాంను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన వెంటనే నోట్ బుక్లను పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ మరమ్మత్తుల పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తిచేసి పాఠశాల పున: ప్రారంభం నాటికి సిద్ధం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ కో ఆర్డినేటర్ కటకం మధుకర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ**



భూమిపై పచ్చదనాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించి.. తగు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలోని పండ్ల మొక్కలకు సంబంధించిన వివరాలను పంచాయతీ కార్యదర్శి, నర్సరీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ కహుస్సేన్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి కావాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేసవి సెలవులు ముగిసి స్కూళ్ల ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మరమ్మతు పనులు పూర్తి కావాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల, అల్మాస్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, వీర్నపల్లి మండలం కంచర్ల మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేయనున్న మరమ్మతు పనుల ప్రణాళికను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయా స్కూల్ లలో తరగతి గదులు, మరుగు దొడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదులు, మరుగు దొడ్ల లో మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలని వివరించారు. ఆయా పనులు త్వరగా మొదలు పెట్టి నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ టిఎస్ఇ డబ్ల్యుఐడిసి ఇఇ అనిత సింగనాథన్, జెడ్పి డిప్యూటీ సిఇఒ గీత, డిఇఒ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

# కావాలనే కార్మికులపై పనిభారం



**ప్రజాపక్షం/నస్పూర్ :** సింగరేణిలోని కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా కొంతమంది కార్మికులను లక్ష్యంగా చేసుకొని పని భారం మోపుతూ మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఐఎన్‌టియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు అన్నారు. కార్మికుల పైన వేధింపు చర్యలను వెంటనే మానుకోవాలని లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి, మినిమం వేజెస్ కార్పొరేషన్ బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు శంకర్రావు ఆధ్వర్యంలో బ్రాంచ్ నాయకులు శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఆర్‌కె 5బి గనిని సందర్శించారు. మైన్ లోని అన్ని శాఖలలో పనిచేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల పని స్థలాలలో వెంటిలేషన్ సౌకర్యాలు కల్పిస్తూ, టూల్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలని, మైన్ రైడింగ్ 10 నిమిషాల ముందు ఆన్ చేయాలని, క్యాంటీన్లో మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ, విశ్రాంతి గదులతో పాటు లాకర్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఈ మైన్‌లో దొంగలు బీభత్సవాన్ని సృష్టించారని, అలాంటి చర్యలు మరలా పునరవృతం కాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గని మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు కళవేణ శ్యామ్, కేంద్ర కార్యదర్శి మల్లారెడ్డి, ఏరియా కార్యదర్శులు చందు, మోహన్, సదయ్య, మహేందర్ రెడ్డి, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ నంబయ్య, కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిస్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటించి జున్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్, త్రాగునీరు, మరుగుదొడ్లకు నీటి సరఫరా, స్లాబ్‌ల మరమ్మతులు, ప్రహరీ గోడల మరమ్మత్తులు, వంటి పనులను చేపట్టాలని సూచించారు. పనుల నిర్వహణకు గ్రామంలో గల మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు. ఇన్చార్జిగా కేటాయించబడిన అధికారి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి, గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నందున్న వరి ధాన్యాలు తడవకుండా ఉండేందుకు రైతులకు సరిపడినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మాత్రమే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత.. లక్ష్మణచందా మండలంలోని పిచర గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జున్ 5 లోపు పనులను పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టబోయే పనులు నాణ్యంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో డిఇఒ రవీందర్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీకళ, జిల్లా సహకార శాఖ అధికారి నర్సయ్య, ఎంపిడిఒలు, అధికారలు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పోలీస్ సిబ్బంది పిల్లలకు వేసవి సెలవుల సంధర్భంగా సమ్మర్ క్యాంపు శుక్రవారం కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి ప్రారంభించారు. ఈ క్యాంపు రెండు వారాలపాటు కొనసాగుతుందన్నారు. ఈ క్యాంపులో భాగంగా పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, సింగింగ్, అథ్లెటిక్స్, కరాటే, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి వాటిల్లో శిక్షణ ఇప్పించనున్నామన్నారు. దానికి గాను సుశిక్షితులైన టీచర్లను, కోచ్‌లను నియమించామన్నారు. పిల్లలకు చదువులతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యతనిచ్చేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ఆటలతో మానసికోల్లాసమే కాకుండా శారీరక ధృడత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డిసిపి శాంతి భద్రతలు ఎ.లక్ష్మి నారాయణ, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు సురేష్ (అడ్మిన్), శ్రీధర్ రెడ్డి (వెల్ఫేర్) లతో పాటు టీచర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గన్నా చంద్రశేఖర్



ప్రజాపక్షం/సూర్యాపేట : రెండు రోజుల నుంచి రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కల్లాలలో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, పండ్ల తోట లు మామిడి, సపోటా, బొప్పాయి కాయలు ఈదురుగాలులకు నేలమట్టమై తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల సానుకూలంగా స్పందిస్తున్నందున ప్రభుత్వ అధికారులు పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి అందించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు కొనుగోలు చేసి రైతులను కాపాడాలన్నారు. సన్నరకం, దొడ్డు రకం అని తేడా లేకుండా రూ.500ల బోనస్‌ను వెంటనే అందచేయాలన్నారు. ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనంతుల మల్లేశ్వరీ, గీత పనివారల జిల్లా అధ్యక్షుడు కొండ కోటయ్య, మాజీ సర్పంచ్ నంద్యాల రాంరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు 'డబుల్' ఇండ్లు కేటాయించాలి : సబిత




ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : డ్రాలో కేటాయించిన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ డిమాండ్ చేశారు. భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని అర్హులైన వారికి డ్రాలో కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏశాల అశోక్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో ఐదు సంవత్సరాల క్రితం సుమారు 500 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించారన్నారు. శాసనసభ ఎన్నికల ముందు డ్రాలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, అలాట్మెంట్ లెటర్ ఇచ్చారని, కానీ ఇండ్లు ఇవ్వలేదన్నారు. దీంతో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, తలుపులు, కిటికీలు గుర్తు తెలియని వ్యక్తు ఎత్తుకెళ్లుతున్నారు. లబ్దిదారులకు కెటాయించిన డబుల్ ఇండ్ల కాలనీలలో విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, సిసి రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్లాట్లు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, చిక్క నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శం.. పశ్య రాంరెడ్డి జీవితం



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పశ్య రాంరెడ్డి జీవితం అందరికీ ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో పశ్య రాంరెడ్డి ఐదో వర్ధంతిని సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. పశ్య రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి సభలో యల్లావుల రాములు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన శంభిరెడ్డి దగ్గరి బంధువైన రాంరెడ్డి మొదటి నుండి కమ్యూనిస్టు భావజాలాన్ని ఈ ప్రాంతంలో ప్రచారం చేశారన్నారు. కమ్యూనిజం జెండాను భుజాన ఎత్తుకుని, కమ్యూనిజం సిద్ధాంతాన్ని నమ్ముకుని జీవితాంతం ఆచరించి జీవించిన మహనీయుడు రాంరెడ్డి అన్నారు. సిపిఐలో అనేక పదవులతో పాటు 27 సంవత్సరాలు పిఎసిఎస్ చైర్మన్‌గా, గ్రామపంచాయతీ సభ్యుడిగా, టాక డైరెక్టర్‌గా పనిచేశారన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజానాయకుడిగా పశ్య రాంరెడ్డి ఎదిగారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంబాల శ్రీనివాస్, యల్లావుల రమేష్, పొనుగుపాటి వాసుదేవరావు, ఇందిరాల వెంకటేశ్వర్లు, మామిడి నరసయ్య, కుడితొట్టి స్వామి, కొట్టు మోహన్‌రావు, కొట్టు బాబు, బంటు శ్రీను, దేవరం రవీందర్‌రెడ్డి, జడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటిలో అడ్మిషన్లకు నోటిఫికేషన్

పూర్తిస్థాయి వైస్‌ఛాన్సలర్‌ను నియమించాలి
ట్రిపుల్ ఐటిలో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపాలి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఏర్పాటైన బాసర ట్రిపుల్ ఐటిలో అడ్మిషన్ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక బాసర ట్రిపుల్ ఐటిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్ లేకపోవడంతో బాసర ట్రిపుల్ ఐటి అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా గాడి తప్పిందన్నారు. మరో ఇరవై రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నప్పటికీ అడ్మిషన్‌ల కోసం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం పలుఅనుమానాలకు తావిస్తోందన్నారు. దాంతో పాటు బాసర ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో పలుమార్లు ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. దీనిపై విద్యార్థులు ధర్నాలు చేసినప్పుడు, స్పందిస్తున్న అధికారులు వసతుల కల్పన, మెస్ నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపెట్టలేకపోతున్నారన్నారని విమర్శించారు. బాసర ట్రిపుల్ ఐటిలో అడ్మినిస్ట్రేషన్ విభాగం, మెస్, హాస్టళ్ల విభాగాలు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయాయని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బాసర ట్రిపుల్ ఐటిలో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, వసతులు కల్పించి బాసర ట్రిపుల్ ఐటిలో నూతనంగా చేరబోయే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ధైర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించనట్లయితే ఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తం గా ఉద్యమిస్తామని పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. ప్రతినిధి బృందంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, రెహమాన్, సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి 21న చలో బస్ భవన్

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21న జరిగే చలో బస్ భవన్ కార్యక్రమంలో ఆర్‌టిసి కార్మికులు అత్యధికంగా పాల్గొనాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆసిఫాబాద్ డిపోలో కార్మికులతో కలిసి చలో బస్ భవన్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికులు అత్యంత కీలక పాత్ర పోషించారని కానీ, నేడు తెలంగాణలో ఆర్‌టిసి కార్మికుల బతుకులు బానిస బతుకులుగా ఉన్నాయని, గత 10 సంవత్సరాల నుండి తెలంగాణ ఆర్‌టిసి కార్మికులు కట్టు బానిసలుగా బతుకుతూ దినదినం ఒక గండంలా తమ విధులను నిర్వహిస్తున్నారన్నారు. 70 సంవత్సరాల ఆర్‌టిసి చరిత్రలో డ్రైవర్, కండక్టర్‌లను, ఉద్యోగులను విభజించి పాలించు విధానాన్ని ఆర్‌టిసి ఎండి శ్రీకారం చుట్టారని, ఈ వివక్ష విధానాన్ని ఆర్‌టిసి కార్మిక వర్గమంతా ముక్త కంఠంతో ఖండించి, తిప్పి కొట్టడానికి ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. ఒక పక్క చాలీచాలని జీతాలు, మరో పక్క మానసిక వేధింపులు, ఇంకో పక్క అధిక పనిభారాలు తట్టుకోలేక ఎవరికి చెప్పుకోవాలో దిక్కులేక అనునిత్యం నరక యాతన అనుభవిస్తున్న కార్మికవర్గం ఒక్కసారి పిడికిలి బిగించి బానిస సంకెళ్లను తెంచి ఉద్యమించినప్పుడే మన హక్కులు సాధించ బడుతాయన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీన ప్రక్రియను ప్రారంభించి వెంటనే అపాయింటేడే ప్రకటించాలని, భారత రాజ్యాంగం కల్పించిన చట్టం ప్రకారం ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్స్‌ను పునరుద్ధరించాలన్నారు. 2013 ఎరియర్స్ బాండ్ డబ్బులు అన్ని కేటగిరిల ఉద్యోగులకు చెల్లించాలని, రిటైర్డ్, సర్వీసులో ఉన్నవారికి రావాల్సిన బకాయిలను మొత్తం విడుదల చేయాలని, ఉద్యోగుల అందరికీ సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, టికెట్ తీసుకొని ప్రయాణించే పూర్తి బాధ్యత ప్రయాణికులదే ఉండాలని, రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్యం, మెడికల్ రిటైర్డ్ నియామకాలు చేపట్టాలని, 2017 నుండి పిఆర్‌సి మే నెల నుంచి అమల్లోకి వస్తున్నందున కార్మికులకు రావలసిన అలవెన్స్‌లను పెంచి ఈనెలలోనే అమలు చేయాలని, డ్రైవర్ కం కండక్టర్ విధానం మానుకోవాలని, డ్రైవర్, కండక్టర్, శ్రామిక్ నియామకాలు చేపట్టాలని, ఎండి ఏకపక్ష నిర్ణయాలు, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని, ఆర్‌టిసిలో రిటైర్మెంట్ అయిన కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా రావాల్సిన బెనిఫిట్స్‌ను చెల్లించాలని, అలాగే హయ్యర్ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి టి.దివాకర్, కార్మికులు ఆయుబ్, రాజన్న, పాషా, రిటైర్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.మల్లేష్, తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై నిరసన

పోలీసుల బందోబస్తు మధ్య సదస్సు
కంపెనీ నిర్మాణాన్ని రద్దు చేయాలని నర్సింహులపల్లి గ్రామస్తుల డిమాండ్



ప్రజాపక్షం/బెజ్జంకి : మండల పరిధిలోని పోతారం రెవెన్యూ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీ నిర్మాణాన్ని రద్దు చేయాలని సమీప నర్సింహులపల్లి గ్రామస్తులు పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేసిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నర్సింహులపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామస్తులు, ఇథనాల్ కంపెనీ ప్రతినిధులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సమక్షంలో కంపెనీ ప్రతినిధులతో కంపెనీ నిర్మాణం పని చేసే విధానాన్ని అందులో వెలువడే రసాయనాలను గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించగా కంపెనీ నిర్మాణామే వద్దంటు గ్రామస్తులు వాదనకు దిగారు. కంపెనీ నిర్మాణం చేపట్టడం వలన పంట పొలాలు దెబ్బతినడంతో పాటుగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇథనాల్ కంపెనీ నిర్మాణం రద్దు చేయాలని గ్రామస్తులు ససేమిరా అనడంతో ప్రజాభిప్రాయం మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.



కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎసిపి మధు, సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ కృష్ణారెడ్డి, త్రీ టౌన్, చిన్న కోడూర్, రాజగోపాల్‌పేట ఎస్ఐలు, అధికారులు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ఎస్‌బిఐ అవగాహన




ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ శుక్రవారం అవేర్‌నెస్ డ్రైవ్‌ను ప్రారంభించింది. హైదరాబాద్ కోఠిలోని ప్రధాన కార్యాలయ భవనం నుంచి ప్రచార వాహనాన్ని బ్యాంక్ జనరల్ మేనేజర్ (ఎన్‌డబ్ల్యు1) దేబశిష్ మిత్ర, జనరల్ మేనేజర్ (ఎన్‌డబ్ల్యు2) ఎకె సారథి, జనరల్ మేనేజర్ మంజు శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈమధ్యకాలంలో సైబర్ నేరాలు పెద్ద సంఖ్యలో నమోదవుతున్న నేపథ్యంలో, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 గురించి, అదే విధంగా సైబర్ నేరాలను ఫిర్యాదు చేయాల్సిన పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జీఓవి.ఇన్ (www.cybercrime.gov.in), సోషల్ మీడియా హ్యాండిల్స్ (ఇండియన్‌సైబర్) వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ప్రచారం ప్రధాన లక్ష్యం. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, లింక్డ్‌ఇన్, కూ, షేర్‌చాట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో, పబ్లిక్ పోస్టుల్లో సైబర్ భద్రతపై ఎస్‌బిఐ అవగాహన కల్పిస్తూ వాహనం నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతుంది. అవేర్‌నెస్ వెహికల్ ప్రారంభం సందర్భంగా మంజు శర్మ మాట్లాడుతూ ఆర్థిక సైబర్ మోసాలను అరికట్టేందుకు అవగాహ న కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ క్రైమ్ అనేక మంది వ్యక్తులు, సంస్థలపై ప్రభావం చూపుతున్నదని, దీనివల్ల ముప్పు పెరుగుతున్నదని చెప్పా రు. మన జీవితంలోని వివిధ అంశాల కోసం ఎక్కువగా సాంకేతికతపై ఆధారపడుతున్నందున, సైబర్ బెదిరింపుల ప్రమాదం కూడా పెరుగుతున్న విషయా న్ని మంజు శర్మ వివరించారు. సైబర్ సెక్యూరిటీ అవగాహన డిజిటల్ ప్రపంచంలోని సంభావ్య ప్రమాదాలు, ముప్పుల గురించి వ్యక్తులు, సంస్థలకు అవగాహన కల్పిస్తుందని ఆమె చెప్పారు. సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం ద్వారా డేటా ఉల్లంఘనలు, గుర్తింపు చౌర్యం, ఇతర సైబర్‌క్రైమ్స్ ను నిరోధించచడానికి వీలవుతుందన్నారు. ఇది సున్నితమైన సమాచారాన్ని రక్షించడం గురించి మాత్రమేగాక, బ్యాంక్ డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా కాపాడుతుందని మంజు శర్మ పేర్కొన్నారు. సైబర్ బెదిరింపులు వ్యాపారాలకు విఘాతం కలిగిస్తాయని, జాతీయ భద్రతను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుందని ఆమె గుర్తుచేశారు. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించే ప్రతి ఒక్కరూ అత్యాధునిక సైబర్ భద్రత అంశాలను అర్థం చేసుకోవాలని మంజు శర్మ అన్నారు. సైబర్ సెక్యూరిటీ అవగాహన మన డిజిటల్ జీవితంలో ఒక ముఖ్యమైన అంశమని, ఈ విషయంలో సమష్టి కృషి మాత్రమే అందరికీ సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టిస్తుందని ఆమె చెప్పారు. జనరల్ మేనేజర్ ఎకె సారథి మాట్లాడుతూ సైబర్ ముప్పులను గుర్తించి, అడ్డుకునే పరిజ్ఞానాన్ని, అవగాహనను అందిస్తామని అన్నరు. బలమైన పాస్‌వర్డ్‌లను సృష్టించడం, దానిని అప్‌డేట్ చేయడం, అనుమానాస్పద ప్రయత్నాలను గుర్తించడం వంటి సురక్షితమైన ఆన్‌లైన్ అలవాట్లను ఈ కార్యక్రమం ద్వారా వివరిస్తామన్నారు. ఈ చర్యలు సైబర్ దాడుల బారిన పడుతున్న వారి సంఖ్యను గణనీయంగా తగ్గిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సైబర్ బెదిరింపుల నుంచి మనల్ని మనం రక్షించుకోవడంతోపాటు, మన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా రక్షించుకోవడానికి, సురక్షితమైన డిజిటల్ ప్రపంచ నిర్మాణానికి ఈ అవగాహనా కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జితేంద్ర కుమార్‌శర్మ (డిజిఎం సిడిఒ), మాలతీ నంబియార్ (డిజిఎం సిఎం అండ్ సిఎస్), సునీల్ కుమార్ గోయెల్ (డిజిఎం ఫిన్ అండ ఆప్స్), బ్యాంక్ మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ అండ్ సిఎస్ ఎజిఎం జి.రామకృష్ణతోపాటు బ్యాంక్ ఇతర డిజిఎంలు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## థాక్రేదే శివసేన

(మొదటి పేజీ తరువాయి)

(ఎంఎంఆర్), నాసిక్ జివల్లా, కాందేశ్ ప్రావిన్స్‌లోని ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. వీటిలో అత్యధిక చోట్ల రెండు శివసేనలు ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. ముంబైలో నగరంలోని ఏడు లోక్‌సభ స్థానాల ఫలితాలకే రాజకీయ ప్రాధాన్యత సంతరించుకోవడమే కాకుండా, ముంబై రాజకీయాలకు కేంద్ర బింధువైన అత్యంత ధనికమైన బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి)ని ఎవరు శాసిస్తారో తేలిపోనుంది. ఈ నగరంపై థాక్రే కుటుంబం రెండు దశాబ్దాలుగా పట్టుబిగించి ఉంది.

ఈ 14 స్థానాలలో బిజెపికి బలమైన సంస్థాగత నిర్మాణం ఉన్నదనేది వాస్తవమైనప్పటికీ, షిండే గట్టిగా పట్టుబట్టడంతో ఆయన పార్టీకి కొన్ని సీట్లు ఇవ్వాల్సి వచ్చింది. అయితే సరైన అభ్యర్థులను ఎంపిక చేయనందున ముంబై సౌత్, ముంబై నార్త్ వెస్ట్ స్థానాలలో అధికార మహాయుతి కూటమికి దెబ్బ తగిలే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ నియోజకవర్గం నుండి షిండే శివసేన తరుపున సిట్టింగ్ ఎంఎల్‌ఏ రవీంద్ర వాయ్‌కర్‌ను మహాయుతి అభ్యర్థిగా పోటీలో దించారు. తొలుత థాక్రేతో ఉన్నప్పటికీ, తరువాత షిండే వైపునకు రవీంద్ర వాయ్‌కర్ పార్టీ ఫిరాయించారు. మనీలాండరింగ్ కేసులో ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిఘాలో ఉన్నారనే ఆరోపణలు ఉండేవి. ఆ స్థానంలో శివసేన (యుబిటి) నుండి సిట్టింగ్ ఎంపి గజానన్ కిరీట్కర్ కుమారుడు అమోల్ కిరీట్కర్ రంగంలో ఉన్నారు. కిరీట్కర్ అంతుకు మందు వరకు షిండే సేనలో ఉన్నారు.

కీలకమైన ముంబై సౌత్ నియోజకవర్గం నుండి థాక్రే విశ్వాసపాత్రుడు, సిట్టింగ్ ఎంపి అరవింద్ సావంత్ పోటీ చేస్తుండగా, ఆయనపై షిండే సేన నుండి ఎంఎల్‌ఏ యామిని జాదవ్ పోటీ చేస్తున్నారు. ఆమె భర్త యశ్వంత్ జాదవ్ బిఎంసిలో బడా నాయకుడు. ఆయన మీద కూడా పన్ను చెల్లింపులకు సంబంధించి ఆదాయ పన్ను నిఘా ఉంది. ఆ రెండు నియోకవర్గాలలో రవీంద్ర వాయ్‌కర్, జాదవ్ సతీమణి తమ కూటమి అభ్యర్థులగా బరిలో ఉండడంతో మొన్నటి వరకు వారిని అవినీతిపరులు అని ప్రచారం చేసిన స్థానిక బిజెపి శ్రేణులు ఇరకాటంలో పడ్డాయి.

శివసేనలో చీలిక భాషాపరమైన చీలకకు కూడా దారి తీసింది. ఇది ముంబై మహానగరంలో మారాఠీ మాట్లాడే ఓటర్లు వర్సెస్ గుజరాతీ మాట్లాడే ఓటర్లు అనే స్థాయికి చేరింది. ఇక్కడ బిజెపి ఓటర్లలో అత్యధికులు ఉత్తర భారతదేశం నుండి వచ్చి స్థిరపడినవారే ఉన్నారు. థాక్రే ప్రభుత్వాన్ని పడగొట్టిన బిజెపిపై మరాఠీ మాట్లాడే ఓటర్లలో అంతర్గతంగా తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడింది.

షిండే సేన, బిజెపిల మధ్య తీవ్రమైన విబేధాలు 'మహాయుతి' కూటమి ఎదుర్కొంటున్న మరో సమస్య. కీలకమైన కల్యాన్ నియోజకవర్గం (థానే జిల్లా) నుండి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్న సిఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు, సిట్టింగ్ ఎంపి శ్రీకాంత్ షిండేఈ సమస్య ఎదుర్కొంటున్నారు. అక్కడ శివసేన (యుబిటి) నుండి కళ్యాణి దారేకర్ రంగంలో ఉన్నారు. శ్రీకాంత్ షిండే అభ్యర్థిత్వం చూసేందుకు బలంగా కనిపిస్తున్నప్పటికీ, ఆయకు స్థానిక బిజెపి నాయకత్వంపై నుండి తీవ్రమైన వ్యతిరేకత అనే ప్రమాదం పొంచి ఉంది.

ముంబై నగరం, థానే వెలుపల చెప్పుకోదగ్గ స్థానం నాసిక్ నియోజకవర్గం. ఇక్కడ కూడా మహాయుతి కూటమి భాగస్వామ్య పార్టీలు బిజెపి, షిండే సేనల మధ్య సఖ్యత కుదరడం లేదు. అక్కడ షిండే సేన నుండి సిటింగ్ ఎంపి హేమంత్ గోడ్సే , థాక్రే సేన అభ్యర్థి రాజాబావూ వాజే పోటీ పడుతున్నారు. ఆ స్థానం నుండి గోడ్సేకు మద్దతిచ్చేందుకు బిజెపి కార్యకర్తలు అనాసక్తితో ఉన్నారు. ఆయనకు బదులుగా మహారాష్ట్ర క్యాబినెట్ మంత్రి, ఎన్‌సిపి (అజిత్ పవార్) నేత చగన్ భుజ్‌బల్‌ను పోటీ పడితే బాగుండేదని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. భుజ్‌బల్ స్వచ్ఛందంగా రేసు నుండి తప్పుకున్నప్పటికీ, ఎంత వరకు గోడ్సేకు సహకరిస్తారో వేచి చూడాలి.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంచాలకులు మల్సూరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఫుడ్ పార్కులలోని ఖాళీ స్థలాలను గుర్తించి, అన్ని మౌళిక సదుపాయాలు కల్పించి, ప్రభుత్వం తరుపున అన్నిరకాల తోడ్పాటు అందించి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రైవేట్ పెట్టుబడిదారులకు కావాల్సిన ప్రోత్సహన్ని అందించి ఫుడ్ పార్కులను ఇంకా అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. అకాల వర్షాలకు, ఇతర ప్రకృతి వైపరిత్యాల వల్ల రైతులు నష్టపోకుండా, వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులకు సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు బయోమన్యుర్, బయోమాస్‌కు సంబంధించిన యూనిట్లను కూడా ప్రోత్సహించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఇలా చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర రావడమే కాకుండా నష్టపోయే అవకాశాలు ఉండవని తెలిపారు.

ఈ ఏడాది మార్చి 11న విడుదలైన జిఓ నెం. 1 ప్రకారం అన్ని ప్రభుత్వశాఖలు తెలంగాణ చేనేత వస్త్ర ఉత్పత్తి సంస్థ టెస్కో ద్వారా రాష్ట్రంలో శానిటరీ నాప్ కిన్ తయారీ యూనిట్ల ఏర్పాటు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. టెస్కో ద్వారా తప్పనిసరిగా వస్త్రాలను కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి సుమారు 255 కోట్ల విలువైన ఆర్డర్లు రావడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఇతర ప్రభుత్వరంగ సంస్థల నుండి కూడా ఎటువంటి ఆర్డర్లు ఉన్నా కూడా టెస్కో ద్వారా మాత్రమే కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. టెస్కో ద్వారా సర్టిఫికెట్ పొందిన తరువాత మాత్రమే ప్రైవేట్ మార్కెట్‌లో టెండర్ల ద్వారా ఆర్డర్లను ఇవ్వవచ్చునని తెలిపారు. దీని మీద ట్రెజరీలకు, డిపార్ట్ మెంట్ లకు, కార్పోరేషన్లకు తగిన సూచనలు ఇచ్చామన్నారు. ఈ ఆదేశాలు అతిక్రమించిన వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. బుగ్గపాడు మెగా టెక్స్ టైల్ పార్కులో ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించి వచ్చేనెలలోనే ఆ పరిశ్రమల ప్రారంభోత్సవం దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అన్నారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలతో కలిపి 5.70 కోట్ల మీటర్ల ఆర్డర్లు నేత కార్మికులకు వచ్చేవని, కానీ ఈ సంవత్సరం బతుకమ్మ చీరలు కాకుండానే 2.50 కోట్ల మీటర్ల ఆర్డర్లు వచ్చాయనీ, ఇంకా 80 లక్షల మీటర్ల ఆర్డర్లు వచ్చేవి ఉన్నవని తెలిపారు. నేత కార్మికులకు సంవత్సరం పొడుగునా పని కల్పించాలని, వచ్చిన ఆర్డర్లకు సంబంధించిన బిల్లులు కూడా త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చేనేత రంగ పరిశ్రమల ఆధునీకరణ కోసం 350 కోట్లు కేటాయించడం ద్వారా నాణ్యమైన వస్త్ర ఉత్పత్తులను ఉత్పత్తి చేసేలా చూడాలన్నారు. దీనివలన వస్త్రాల నాణ్యత ఉత్పత్తి పెరిగి, డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. పవర్ లూమ్స్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా తెలిపారు. దీని ద్వారా పవర్ లూమ్స్ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

### టెస్కో ద్వారా నాప్ కిన్ తయారీ యూనిట్ల ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర చేనేత పారిశ్రామిక సహకార సంఘం ద్వారా శానిటరి నాప్ కిన్ యూనిట్ ఏర్పాటును వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థినిలకు విద్యాశాఖ ద్వారా నాప్ కిన్‌లు సరఫరా చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెటింగ్ గిడ్డంగుల సంస్థ గోదాములపైన సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీని కోసం విద్యుత్ అధికారులతో సంప్రదించి తగిన ఒప్పందాలు చేసుకోవాలన్నారు. దీనివల్ల సంస్థలు స్వంత అవసరాలకు విద్యుత్ వినియోగించుకోవడమే కాకుండా, మిగిలిన విద్యుత్‌ను అమ్ముకోవడం ద్వారా సంస్థలు ఆదాయం పొందవచ్చనన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే జల విద్యుత్, బొగ్గు ద్వారా విద్యుత్, గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని, వీటికే కాకుండా మన రాష్ట్రం సోలార్ విద్యుత్ కి కూడా అనువైన స్థలమని, కాబట్టి ఇక్కడి వనరులను ఉపయోగించుకుని సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు సబ్సిడీ ఇస్తుందని, ఈ సబ్సిడీని కూడా పొందే అవకాశాలను చూడాలన్నారు. మార్కెటింగ్ గిడ్డంగుల సంస్థల అధికారులు, విద్యుత్ సంస్థ టెక్నికల్ అధికారులతో చర్చించి, ఎన్ని చదరపు అడుగుల వరకు ఎన్ని కిలో వాట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుచేసుకోవచ్చునని అలానే వాటి ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుంది? ఉత్పత్తి చేసిన విద్యుత్‌లో ఎంత వరకు వాడుకుంటాం ? ఎంత మిగులు విద్యుత్ ఉంటుంది, ఈ సోలార్ ప్యానెల్స్ వలన సంస్థకు లాభామా, నష్టమా ? అనే ప్రతిపాదనలు తెప్పించుకోవాలని అధికారులకు సూచించారు. రైస్ మిల్లింగ్ పాలసీలో భాగంగా కొత్త రైస్ మిల్లర్ల ఏర్పాటు మరియు మిల్లింగ్‌ల ఆధునీకరణను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దీనివలన వరి పండించే రైతులకు లాభం పొందుతారని తెలిపారు. కాగా, ఎలాంటి యూనిట్లు ఏర్పాటు చేసినా తూతూమంత్రంగా కాకుండా, దీర్ఘకాలం కొనసాగేలా స్వయంసమృద్ధి సాధించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఖమ్మం మార్కెట్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికరించాలని, అలాగే కోహెడ పండ్ల మార్కెట్ నుండి అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు జరిగేలా అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మంత్రి కోరారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, జౌళి శాఖలలో ఒకే రకమైన పనితీరు కలిగిన కార్పోరేషన్లను సంఘటితపర్చి ఒకే కార్పోరేషన్ ఏర్పాటుచేసి, వాటిని బలోపేతం చేసేటందుకు ప్రతిపాదనలు తయారుచేసి త్వరలోనే ముఖ్యమంత్రిఆమోదానికి పంపిస్తామని తెలిపారు. పదవీ కాలం ముగిసిన అన్ని సహకార సంఘాలకు, గత పది సంవత్సరాలుగా పాలక వర్గాలు లేక పర్సన్ ఇన్‌చార్జి వ్యవస్థలతో అస్తవ్యస్తంగా నిర్వహించబడుతున్నాయన్నారు, ఈ హౌసింగ్ సొసైటీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితో వెంటనే ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఉద్దవ్ థాక్రే సభకు భారీగా ప్రజలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. మొత్తమ్మీద పరిస్థితులను గమనిస్తే ఉద్దవ్ ఠాక్రేదే అసలైన శివసేనగా మరాఠా ఓటర్లు ఎంచుకున్నట్లుగా కనపడుతోందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముంబై అల్లర్ల తరువాత అతివాత హిందూ పార్టీగా బాల్ థాక్రే నేతృత్వంలోని శివసేన రూపాంతరం చెందింది. ప్రస్తుతం కఠిన రాజకీయపరీక్షను ఎదుర్కొంటున్న ఆయన కుమారుడు ఉద్దవ్‌థాక్రే ఆధ్వర్యంలోని శివసేన (యుబిటి)కి ముస్లిం మైనారిటీలు మొగ్గు చూపుతుండడం విశేషం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com